అవినీతిని, అక్రమాలను చూస్తూ ఉరుకోవడమే అతి పెద్ద పాపం..

చైతన్య వారధి
ఛారిటబుల్ ట్రస్టు(ప్రజా చైతన్యం కోసం)



# చైతన్య వారధి
తెలుగు దిన పత్రిక

RNI.No.APTEL \ 2006 \18521

website:www.cvdaily.in

CHAITANYA VARADHI TELUGU DAILY

Simultaneously Published from Visakhapatnam, Vizianagaram, Ananthapur and Guntur



చైతన్యవారధి పత్రికకు జిల్లాలో ప్రతి మండల కేంద్రం నుంచి రిపోర్టర్లు కావలెను. స్థానిక రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన ఉండి, ప్రజా సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తేవాలన్న ఆసక్తి ఉన్న యువకులకు ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్రదించండి - 9848682422



VISAKHAPATNAM | సంపుటి: 19 | సంచిక: 141 | సోమవారం | 17-11-2025 | ఎడిటర్ : బి.గోపీనాథరావు | పేజీలు : 8 | వెల : 1.00


## ఇంజినీర్లు తమ అనుభవాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

**బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లుకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన**



డెస్క్: ముంబయి- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లు తమ అనుభవాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. తద్వారా భవిష్యత్తులో ఈ తరహా ప్రాజెక్టుల అమలు సమయంలో ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో భాగంగా సూరత్‌లో నిర్మిస్తున్న స్టేషన్‌లో ఇంజినీర్లు, ఇతర సిబ్బందితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పనుల పురోగతిని ఆరా తీశారు. దీనికి సంబంధించిన వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పొందిన అనుభవాలను నమోదు చేసి, 'బ్లూ బుక్'లా సంకలనం చేస్తే.. భవిష్యత్తులో పెద్దఎత్తున ఈ తరహా ప్రాజెక్టులను తీసుకొచ్చే విషయంలో దేశం నిర్ణయాత్మకంగా ముందుకు వెళ్లగలదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. భారత్ పదేపదే ప్రయోగాలు చేయకుండా.. గత నమూనాల నుంచి నేర్చుకున్న విషయాలను ప్రతిబింబించాలన్నారు. ఈ ప్రాజెక్టు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీకి సిబ్బంది తెలిపారని ప్రధాన మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. "సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను సందర్శించాను. ముంబయి- అహ్మదాబాద్ హై స్పీడ్ రైలు కారిడార్ పురోగతిని సమీక్షించాను. దేశంలో మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై పనిచేస్తున్న బృందంతో సంభాషించే అవకాశం లభించింది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

**13వ పంచగవ్య సదస్సు** | **దేశవాళీ ఆవులు కనుమరుగవుతున్నాయి**

## పరిరక్షించాల్సిన బాధ్యత నేటి తరానిదే

**-ఉడిపి పేజావర అధోక్ష మఠం జగద్గురు విశ్వప్రసన్న తీర్థస్వామి**



తిరుపతి: 'ప్రాచీన కాలంలో ప్రతి దేవస్థానంలో పంచగవ్యను ప్రసాదంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇందుకు కారణం దేశీ ఆవులు కను మరుగవడమే' అని ఉడిపి పేజావర అధోక్ష మఠం జగద్గురు విశ్వప్రసన్న తీర్థస్వామి తెలిపారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొన సాగుతున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం ముగింపు సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచగవ్యను ఔషధంగా కాకుండా ఆహారంగా తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని.. ఇదే అధర్వణ వేదంలోనూ ఉందని పేర్కొన్నారు. గోమాత పరిరక్షణకు ఉడిపిలోని తమ మఠం కృషి చేస్తుందని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గవ్య సిద్ధ వైద్యులు ఆచార్య జీవన్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. దేశీ ఆవులు ఉన్న ఇల్లు వైద్యాలయంగా, దేవాలయంగా శోభిల్లుతుందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఒంగోలు గిత్త, ఆవులను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని సూచించారు. పుంగనూరు ఆవుల సంరక్షణ సైతం ఆశాజనకంగా లేదని వాపోయారు. సదస్సు చివరిరోజు 150 మంది ప్రముఖులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తరలివచ్చారు. గోమాత స్పర్శ, 16వ గవ్య, విత్ శరీర సమతౌల్యం అనే అంశాలపై చర్చించారు. పంచగవ్య విద్యాపీఠం నుంచి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. పంచగవ్య విద్యాపీఠం ఉప-గురుకులపతి డా.కమల్ తాయోరి, పంజాబ్ శ్రీమద్ భగవత్ కథ వాచక్ శ్రీధరాచార్య మహరాజ్, పంచగవ్య గురుకులం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక, ఆర్థిక అసమానతలు విద్యతోనే తొలగింపు

**- రాజ్యాంగం ఎల్లప్పుడూ మనుగడ సాగించే జీవపత్రం - సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్**

అమరావతి: ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించడం ద్వారానే సామాజిక ఆర్థిక అసమానతలు తొలగించడం సాధ్యమవుతుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవారు వ్యాఖ్యానించారు. మంగళగిరి సికె కన్వెన్షన్‌లో రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ 75 ఇయర్స్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అనేది ఎల్లప్పుడూ ఒకేలా స్థిరంగా, దృఢంగా ఉండిపోకుండా పరిస్థితులకు కాలానుగుణంగా పరిణామం చెందుతూ ఎల్లప్పుడూ మనుగడ సాగించే జీవపత్రంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆర్టికల్ 368 పొందుపరిచారన్నారు. తద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశాన్ని ఏర్పరచడం జరిగిందన్నారు. దేశంలో ప్రతి పౌరునికి ప్రసాదించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రాథమిక హక్కుల వల్లే సాధ్యమన్నారు. ఇందుకు చారువాలా అయిన మోడీ దేశ ప్రధాని కాగా, మహారాష్ట్రలో మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాగలిగానని అన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని, ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగం ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల అంశంపై రాజ్యాంగానికి మొదటి సవరణ చేశారన్నారు. రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్ అమలు చేయాలని తాను వర్గీకరణ కేసులో చెప్పానని, ఇది కొందరికి నచ్చలేదని, అయినప్పటికీ తాను అందుకు కట్టుబడి ఉన్నానన్నారు. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మౌలిక స్వరూపం అనే భావనను తీసుకొచ్చిందన్నారు. రాజ్యాగం మౌలిక స్వరూపాన్ని సవరించరాదని సుప్రీంకోర్టు




తీర్పునిచ్చిందన్నారు. ప్రతిపౌరుడిని దృష్టిలో ఉంచుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించుకునేందుకు దేశాభివృద్ధికి ప్రజల సంక్షేమం దృష్ట్యా రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఉందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలేను అంబేద్కర్ గురువుగా భావించేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఒకరి సార్వభౌమాధికారంలో వేరేవారు జోక్యం చేసుకోకుండా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ విధానాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోవాల్సిన అవసరం కూడా లేదని, ఆపరేషన్ సింధూర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు. తాను ఎప్పుడూ నిత్య విద్యార్థిగానే కొత్త విషయాలను నేర్చుకుంటూనే ఉంటానన్నారు. మీడియా రంగంలో చాలా మార్పులు

**సీఐ సతీష్‌కుమార్ హత్య కేసు**

## విచారణ వేగవంతం

**- కేసును తాడిపత్రి పోలీసులకు బదిలీ చేయాలని నిర్ణయం**

**- ఘటనా స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ తీరు**



అనంతపురం: రైల్వే సీఐ, తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఇప్పటికే 10 ప్రత్యేక బృందాల ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును గుత్తి రైల్వే పోలీసుల నుంచి తాడిపత్రి పోలీసులకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సతీష్‌కుమార్ ప్రయాణించిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులను విచారించేందుకు సిద్ధమయ్యారు. ఏసీ బోగీల్లోని 1,140 మంది వివరాలు సేకరించి ఆరా తీస్తున్నారు. స్లీపర్, జనరల్ బోగీల్లోని వారినీ విచారించే అవకాశముంది. ఏ1 బోగీలో సతీష్‌కుమార్ బ్యాగ్ ఉన్న 11వ సీటు పక్కన ప్రయాణికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. సతీష్‌కుమార్ సీటు ఎందుకు మారారు? బెర్త్‌లో పడుకోకుండా డోర్ దగ్గరకు ఎందుకెళ్లారు? అలా వెళ్లేటప్పుడు ఎవరైనా గమనించారా? బోగీ చివర్లో ఉండే అటెండెంట్ ఆ సమయంలో ఎక్కడున్నారు? తదితర కోణాల్లో విచారిస్తున్నారు. సతీష్‌కుమార్ ఒంటిపై గాయాలకు సంబంధించి నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నివేదిక వస్తే మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్...సతీష్‌కుమార్ రైలు లోంచి కింద పడిన ప్రదేశం నుంచి 30 మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. శనివారం జిల్లా ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో సతీష్‌కుమార్ శరీర బరువుతో సమానమైన రెండు బొమ్మలతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఘటన జరిగిన సమయంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో వెళ్లింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన రైలు వేగం తక్కువగా ఉంది. దీంతో కచ్చితమైన ఫలితాల కోసం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు.

## ప్రమాదకరంగా రాష్ట్ర స్థితి

**- మాజీ సిఎం వైఎస్ జగన్**



అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సంపద సృష్టిస్తామంటూ టిడిపి, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా ఆర్థిక పరిస్థితి ఉందని ఎక్స్‌లో విమర్శించారు. తక్కువ ఆదాయ వృద్ధి, తక్కువ మూలధన పెట్టుబడి, పెరిగిపోతున్న రుణభారం అని పేర్కొన్నారు. కాగ్ విడుదల చేసిన గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రాష్ట్రప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి కేవలం 7.03 శాతం ఉందని తెలిపారు. సొంత ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా, మూలధన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందంటూ ఎలా ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌డిపి వృద్ధిని 12.02 శాతంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ వృద్ధిని 17.1 శాతంగా లక్ష్యంగా పెట్టుకుందని, కానీ ఫలితాలు దారుణంగా ఉన్నట్లు కాగ్ నివేదికలు చెప్తున్నాయని పేర్కొన్నారు. సంపద సృష్టి లేకపోవటంతో రాష్ట్రం తిరోగమనంలో ఉందని విమర్శించారు.

**మంత్రి సమీక్ష** | **విశాఖ మాస్టర్ ప్లాన్ డిజైన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి**

## 50 అంతస్తుల ఐకానిక్ భవన నిర్మాణం



విశాఖపట్నం: విశాఖ మాస్టర్ ప్లాన్ డిజైన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై ఆదివారం మంత్రి సమీక్ష నిర్వహించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభ సమయానికి.. ఏడు బృహత్తర ప్రణాళిక రహదారుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ రహదారుల నిర్మాణంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంఐజీ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులను కొన్నింటిని డిసెంబర్ నెలాఖరుకు, మరికొన్నింటిని 2026 ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. మాస్టర్ ప్లాన్ రివిజన్‌ను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలన్నారు. కొత్తవలసలో 120 ఎకరాల్లో, శొంఠ్యాంలో 80 ఎకరాల్లో థీమ్ బేస్డ్ సిటీస్ నిర్మాణం, ల్యాండ్ పూలింగ్, పీపీపీ ప్రాజెక్టుల స్థితిగతుల గురించి మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో మధురవాడలో 50 అంతస్తుల ఐకానిక్ భవన నిర్మాణం త్వరలోనే చేపడతామని మంత్రి వెల్లడించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారిణి శిల్పా, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# పాత తీర్మానాలన్నీ వట్టి మాటలుగానే మిగిలిపోయాయి

మానవాళి మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తున్న వాతావరణ మార్పుల నిరోధానికి ఐక్యరాజ్యసమితి దశాబ్దాలుగా కృషి చేస్తోంది. ఆ మేరకు 1997లో క్యోటో ఒప్పందం, 2015లో పారిస్ ఒప్పందం ద్వారా కర్బన ఉద్గారాల కట్టడికి ప్రపంచ దేశాలు సంకల్పం ప్రదర్శించినా ఆచరణలో విఫలమయ్యాయి. 2021 గ్లాస్గో కాప్-26 సభ బొగ్గు వాడకాన్ని పూర్తిగా నిలిపేయాలని తీర్మానించినా అది అటకెక్కింది. 2022 షర్మ్ అల్ షేక్ కాప్-27 సభ వాతావరణ మార్పులవల్ల కలిగే నష్టాలకు పరిహార నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. 2023 దుబాయ్ కాప్ సభ మొట్టమొదటిసారిగా పునరుత్పాదక ఇంధన వనరులకు మారాలని పిలుపిచ్చింది. ప్రస్తుతం వీటి ద్వారా చేస్తున్న విద్యుదుత్పత్తిని 2030కల్లా మూడు రెట్లకు పెంచాలని పేర్కొంది. కానీ, కాప్ పాత తీర్మానాలన్నీ వట్టి మాటలుగానే మిగిలిపోయాయి. కర్బన ఉద్గారాలు 1995కన్నా ఇప్పుడు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో కార్చిచ్చులు అడవులను దహించేస్తున్నాయి. తుపానులు పదేపదే విరుచుకుపడుతూ తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాలు కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు కొండలా పెరిగిపోయాయని నిరుడు బాకులో జరిగిన కాప్-29 సభలో ఐరాస వాతావరణ వ్యవహారాల విభాగాధిపతి సైమన్ స్టియెల్ హెచ్చరించారు. కర్బన ఉద్గారాలను పరిహరించనిదే వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయలేమని కాప్ సభల్లో ప్రపంచ దేశాలు అంగీకరించినా, సంపన్న దేశాలు తమ ఉద్గారాలను తగ్గించడానికి ససేమిరా అంటున్నాయి. అమెరికా అయితే ఏకంగా పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగింది. హరిత వాతావరణ నిధికి ఇవ్వాల్సిన 300కోట్ల డాలర్ల నిధులనూ నిలిపేసింది. ఫలితంగా 2035కల్లా కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు అదనంగా 180కోట్ల టన్నుల మేర పెరగనున్నాయి. తరవాత అమెరికా మళ్ళీ హరిత వాతావరణ నిధిలో చేరినా తాను ఇవ్వాల్సిన 300కోట్ల డాలర్లలో వంద కోట్ల డాలర్లనే విదిల్చింది. ఐరోపా దేశాలు చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాల వాడకానికి సబ్సిడీ ఇస్తూనే ఉన్నాయి. బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడాలదీ అదే వరస. సంపన్న దేశాలు వెదజల్లుతున్న ఉద్గారాలు వాతావరణ మార్పులను మరింత ప్రకోపింపజేస్తున్నాయి. దాని ఫలితాన్ని వరదలు, తుపానులు, మండుటెండల రూపంలో పేద దేశాలు అనుభవిస్తున్నాయి. భూగోళ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్ దగ్గర పట్టి నిలపాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ, భూమి ఇప్పటికే 1.2 డిగ్రీల సెల్సియస్ మేర అదనంగా వేడెక్కింది. 2023 అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరంగా రికార్డులకెక్కింది. ఆ తరవాత రెండు లేదా మూడో స్థానాన్ని 2025 ఆక్రమించనుందని ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా వెల్లడించింది. మొన్న జనవరి-ఆగస్టు మధ్య సగటు ఉష్ణోగ్రతలు 1.42శాతం అధికంగా నమోదైనట్లు వివరించింది. ఇదే ఒరవడి కొనసాగితే 2100కల్లా భూగోళం అదనంగా 2.5డిగ్రీలు లేదా అంతకన్నా ఎక్కువగానే వేడెక్కుతుంది. అసలు రెండు డిగ్రీలు అదనంగా వేడెక్కితేనే పంట వైఫల్యాలు, వడ దెబ్బలు, పగడాల దిబ్బలు అంతరించిపోవడం వంటివి సంభవిస్తాయి. ఇక 2.6-3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగితే ధ్రువాల్లోని మంచు శాశ్వతంగా కరిగిపోతుంది. అమెజాన్ అడవులు అంతరించిపోతాయి. శీతల దేశమైన అమెరికాలోని ఫినిక్స్‌లో ఉష్ణోగ్రత నెల రోజులపాటు 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పశ్చిమాసియాలో ఉష్ణోగ్రత 60 డిగ్రీలకు చేరింది. కెనడాలో కార్చిచ్చులకు 1.8కోట్ల హెక్టార్ల అడవి బుగ్గి అయింది. 2022లో పాకిస్థాన్‌లో వచ్చిన వరదలకు 1700 మందికిపైగా మరణించారు. 2023లో లిబియాపై విరుచుకుపడిన డేనియల్ తుపానుకు 4వేల మందికిపైగా బలయ్యారు. తూర్పు ఆఫ్రికాలో దుర్భిక్షం వల్ల ఆకలి కేకలు మిన్నంటాయి. ఇలా వాతావరణ మార్పుల వల్ల 2023లో 26,800కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లగా, నిరుడు అది 32వేల కోట్ల డాలర్లకు పెరిగింది. అమెరికాకు 2020-24 మధ్య ఏటా 14,900 కోట్ల డాలర్ల నష్టం సంభవిస్తూ వచ్చింది. భారతదేశానికి 2023లో 1200 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. 2024-25లో ఉత్తర భారతంలో 3,080 మరణాలు సంభవించాయి. భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్ దగ్గర పట్టి నిలపాలంటే- మరో అయిదేళ్లలో ఉద్గారాలను 45శాతం తగ్గించాలి. కానీ అది జరగడం లేదు. వాతావరణ మార్పుల కట్టడిలో పేద దేశాలకు సాయపడేందుకు ఏటా పదివేల కోట్ల డాలర్ల నిధులిస్తామన్న సంపన్న దేశాల హామీ అరకొరగానే అమలవుతోంది. 2035కల్లా ఈ సాయాన్ని ఏటా 30వేల కోట్ల డాలర్లకు పెంచాలన్న కాప్-29 తీర్మానం అమలుకు నోచుకోవడం అనుమానమే! ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ఒప్పందం కుదుర్చుకోవడంలోనూ ప్రపంచ దేశాలు విఫలమయ్యాయి. అయితే, అంతర్జాతీయ న్యాయస్థానం మాత్రం కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన చట్టపరమైన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని మొన్న జులైలో తెగేసి చెప్పింది. ఈ బాధ్యతను నెరవేర్చకపోతే నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందనీ హెచ్చరించింది. కానీ చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను ఉత్పత్తిచేసే దేశాలూ కంపెనీలూ కాప్ సభలలో నిర్ణయాత్మక పరిష్కారాలు కుదరకుండా పైరవీలు చేస్తున్నాయి. అమెజాన్ అడవులకు నెలవైన బ్రెజిల్‌లో జరుగుతున్న కాప్-30 సభ అడవులు, సముద్రాలు కర్బన ఉద్గారాలను ఇముడ్చుకోవడంలో సాటిలేనివనీ, వాటిని సంరక్షించుకోవాలని పిలుపిస్తోంది. ఈ సభలో నిర్దిష్ట నిర్ణయాలు జరిగి అవి కార్యరూపంలోకి మారతాయని ఆశిద్దాం.

# ప్రజల సమస్యలో నేను సైతం - నూతన బోర్ ప్రారంభోత్సవంలో బొండా జగన్నాధం (జగన్)



గాజువాక, చైతన్యవారధి: గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో వడ్లపూడి ఆర్ హెచ్ కాలనీ లక్ష్మీపురం శ్రీసత్య సాయి బాబా మందిరం సమీపంలో నూతనంగా బోర్ వేయడం జరిగింది. ఈ బోర్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం (జగన్) పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా బాబా గుడి సమీపంలో జీవీఎంసీ నిధులతో ఒక బోర్ వెయ్యడం జరిగింది ఈనెల 23వ తారీకున జరగబోయే జయంతి వేడుకల్లో వార్డ్ ప్రజలందరూ పాల్గొని బాబా కృపకు బాధ్యతలు అవుతారని. ఇంత మంచి కార్యక్రమంలో నన్ను భాగస్వామి చేసిన కమిటీ వారికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్ రాజు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, చొప్ప నూకరాజు, బొడ్డేటి దేముళ్ళు, గండేపల్లి రాము, మాటూరి రాము, కర్రి కృష్ణ, ఆదినారాయణ, రాంబాబు నాగేశ్వరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్న దామా సుబ్బారావు



గాజువాక, చైతన్యవారధి: గాజవరం నియోజకవర్గం 86వ వార్డు ప్రాంతానికి చెందిన విశాఖపట్నం జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకుడు దామా సుబ్బారావు వైఎస్ఆర్సిపి పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. తాత్కాలిక రాజకీయాలకు దూరంగా ఉన్న అయన ఆదివారం బీజేపీ పార్టీ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తీర్థం పూచ్చుకున్నారు. ఈ సందర్బంగా భారతీయ జనతా పార్టీ కండువా కప్పి రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ దామా సుబ్బారావుని ఆహ్వానించారు. ఆయనతో పాటు స్టీల్ ప్లాంట్ ట్రేడ్ యూనియన్ నాయకుడు ఉదయ నాయుడు, దామా సుమన్ చౌదరి, దామా శ్రేయోభిలాషులను భారతీయ జనతా పార్టీ కండువా కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు.. అనంతరం దామా మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోది నాయకత్వంలో పనిచేయడం నా ధ్యేయమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు ప్రపంచంలో ఎక్కడ అమలు కాలేదని, నరేంద్ర మోది నాయకత్వంలో ప్రజలకు, నా అభిమానులకి సేవ చెయ్యాలని ఆలోచనతో అన్ని విధాలుగా నచ్చే భారతీయ పార్టీలో చేరుతున్నట్లు దామా తెలిపారు.

# ప్రభుత్వ వైద్యకళాశాలను ప్రైవేటికరణను అడ్డుకుందాం

**- కూటమి ప్రభుత్వ నిరంకుశ ప్రయత్నాన్ని అడ్డుకుందాం కోటి సంతకాల సేకరణ లో జిల్లా ఉపాధ్యక్షులు కోమటి శ్రీనివాసరావు**



గాజువాక, చైతన్యవారధి: ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటికరణకు తగదు దంటూ నిరసనలో భాగంగా 87 వార్డు, కణితి అంబేద్కర్ కోలని లో సంతకాల సేకరణ, పేదలకు వైద్యం, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే మెడికల్ కాలేజిల ప్రైవేటికరణను అడ్డుకొందామని 87వ వార్డు ఇంచార్జ్, విశాఖపట్నం జిల్లా, ఉపాధ్యక్షులు కోమటి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ కళాశాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడంపై రాష్ట్ర వ్యాప్తంగా వై.యస్.ఆర్.సి.పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటికరణ వల్ల జరిగే నష్టాలాను వివరిస్తూ, 87 వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమం లో నరవ రమణ, పావాడ శ్రీనివాస్, సబ్బవరపు పార్వతి, బలిరెడ్డి శ్రీకాంత్, ముప్పిని రాజకుమార్, నక్క సుధీర్, పావాడ కృష్ణ, గాలి కృష్ణ, నరవ విజయ, వడ్లపూడి ఈశ్వరావు, వర్రె రాజు, సోక్కర రమణ, పసుపులేటి రంగారావు, కోలని వాసులు పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులుగా కోమటి శ్రీనివాసరావు నియామకం

**- అభినందనలు తెలియజేస్తున్న మండల, నియోజకవర్గ, జిల్లా పార్టీ శ్రేణులు**



విశాఖపట్నం, చైతన్యవారధి: వైయస్సార్సీపి పార్టీ లో కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు సుస్థిరస్థానం కల్పించడంలో పార్టీ ఆవిర్భావం నుంచి కూడా అనేక పదవులు చేపట్టిన సంఘటనలు మనంచూసాము, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఉత్తరాంధ్రలో విశాఖపట్నం కీలకమని భావించిన అయన పలుమార్లు పార్టీ అంతర్గత కార్యక్రమాల్లో ప్రస్తావించడం అందరికీ తెలిసినదే... దీనిలో భాగంగా పార్టీ పటిష్టంగా బాటలు వేసే దిశగా కొత్త ఉత్సాహాన్ని పెంపొందించే విధంగా యువకులను ప్రోత్సహించాలని ఆలోచనతో ఉత్సాహవంతులైన వారికీ పార్టీలో కీలక పదవులకు పలువురు పేర్లు ను ప్రకటిస్తున్నారు... మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షుడిగా కోమటి శ్రీనివాసరావు ను నియమించినట్లు ప్రకటించారు. వైఎస్ఆర్సీపీ పార్టీ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి అధిష్టానం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా అనేక పదవులు గుర్తించిస్తుందని మరోమారు నిరూపితమైంది... కోమటి శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గం జీవీఎంసీ 87వ వార్డు ఇన్చార్జ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గా పనిచేసి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసారు. శ్రీని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కోవిడ్ సమయం నుంచి ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన పార్టీకి, సమాజానికి చేసిన సేవలను గుర్తించి, గాజువాక నియోజకవర్గం సమనవ్యకర్త తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు కె కె రాజు సూచనల మేరకు, పార్టీ అధిష్టానం కోమటి శ్రీనివాసరావు ని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శనివారం ప్రకటన విడుదల చేయడంతో పార్టీలో నూతన ఉత్సాహం మొదలైంది... కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేసి అయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంగా కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని నాపై నమ్మకం ఉంచి అధిష్టానం ఇచ్చిన ఈ భాద్యతతో మరింత ఉత్సాహంగా పార్టీ కోసం పని చేస్తానని ఆయన ఈ సందర్బంగా తెలియజేశారు.. నాపై నమ్మకంతో ఈ భాద్యత రావటానికి సహకరించిన శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు కు, మాజీ మంత్రి వర్యులు గుడివాడ అమర్నాధ్ కు, జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు కే కే రాజు కి, గాజువాక మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి కు, ప్రస్తుత గాజువాక నియోజకవర్గం సమనవ్యకర్త తిప్పల దేవన్ రెడ్డి కు, అభినందనలు తెలియజేసిన ప్రతి ఒక్క వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

**- సీనియర్ జనసేన పార్టీ నాయుకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు**



విశాఖ దక్షణం, చైతన్యవారధి: విశాఖ దక్షిణ నియోజకవర్గం జీవీఎంసీ 32వ పర్యటనలో భాగంగా పలు ప్రాంతాలను సందర్శించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, స్థానిక కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ప్రజల సమస్య ఎక్కడుంటే నేనక్కడుంటానని ప్రజల ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకొని ఆ సమస్య పరిష్కార దిశగా అక్కడికక్కడే సంబంధిత ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, జీవీఎంసీ సెక్రటరీలను సంప్రదించి, సమస్యల త్వరిత పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకునే విధంగా ముందుకుసాగుతున్నారు కందుల.. కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ వార్డు నియోజకవర్గం పరిధిలో ప్రజలకు ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించే దిశగా చూస్తానని ఆయన ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి తెలియజేశారు.

# దుబాయ్‌లో కాపు సంఘం ఆత్మీయ కలయికలో పాల్గొన్న ఎంవిఆర్





**- అనకాపల్లి నుంచి బయలుదేరి వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్న ఎం వి ఆర్**

అనకాపల్లి, చైతన్య వారధి: మన అనుకునే వారు ఉంటే అది ఎక్కడైనా పర్వాలేదు అంటారు పెద్దలు జీవన శైలిలో మార్పులు వలన, నిత్యం బిజీ లైఫ్ సాగిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మన వారి మధ్య కొంత సమయానినైనా గడిపితే ఆ కిక్కే వేరేగా ఉంటుంది. అటువంటి అవకాశం వస్తే మిస్ చేసుకోలేని వారే ఎక్కువగా కనిపిస్తు%శీ%టారు. అలాగే,అలాంటి అవకాశం కోసం ఎదురు చూసేవాళ్ళు ఉంటారన డంలో ఎటువంటి అతిశయోక్తి లేదనే చెప్పవచ్చు. నేడు దుబాయ్‌లో కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరావు (ఎం వి ఆర్ ) అనకాపల్లి నుంచి వెళ్లి, ఆ కార్యక్రమంలో పాల్గొని తన పాత స్నేహితులను, కుటుంబ సభ్యులను చాలా కాలం తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఈ కలయికలో ఒకరినొకరు పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఎం విఆర్ వారితో ఆనందంగా సమయాన్ని గడిపారు. ఈ సందర్భంగా ఎం వి ఆర్ మాట్లాడుతూ, ఇటువంటి అపూర్వమైన కార్యక్రమాలు మనకు ఉన్న స్నేహబంధాలను, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడానికి సహాయ పడుతుందన్నారు. దీనిలో భాగంగా వివిధ రంగాల్లో స్థిరపడిన వాళ్లతో ఎం వి ఆర్ ముచ్చటించారు.దీని వలన నిర్దిష్ట విషయాలపై ఉన్నత స్థాయి చర్చలు, సమీక్షలు, పెట్టుబడులు వంటివి చర్చించే అవకాశం కలిగిందన్నారు. అదేవిధంగా, అందరూ ఆట పాటలు, చిలిపి పనులు వంటి సరదా కార్యకలాపాలలో మునిగి తేలామన్నారు. అనంతరం,అందరం ఆత్మీయ ఆతిథ్యం స్వీకరించామన్నారు.ఈ కార్యక్రమంలో దుబాయ్ దేశపు కాపు సామజిక ప్రతినిధులు, కాపు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మర్యాద పూర్వకంగా తిప్పల దేవన్ రెడ్డి ను కలిసి ధన్యవాదాలు తెలిపిన జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి



గాజువాక, చైతన్యవారధి: విశాఖపట్నం జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడిగా నియమితులైన కోమటి శ్రీనివాస రావు, గాజువాక మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి ను, నియోజకవర్గం సమనవ్యకర్త తిప్పల దేవన్ రెడ్డి ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్బంగా తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ అన్నారు. అనంతరం కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి రావటానికి సహకరించిన శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కరసాల కన్నబాబు కు, మాజీ మంత్రి వర్యులు గుడివాడ అమర్నాధ్ కు, జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కే.కే రాజు, గాజువాక మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గం సమనవ్యకర్త తిప్పల దేవన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో వడ్లపూడి ఈశ్వరావు, బొడ్డేటి మోదీనాయుడు, అతికం శెట్టి రవి, కర్ణం పెంటారావు, కాండ్రేగుల రమణ, కోనేటి పరిపాల్లి,దాసరి రమణ, జెర్రిపోతుల ఈశ్వరావు, పోలేటి సూరి అప్పారావు, సిరపనశెట్టి నర్సింగరావు, రమేష్ జకారియస్, కర్ణం చంటి, కాండ్రేగుల అప్పారావు, రొంతల సుధాకర్, వేముల వెంకన్న, జల్లు బాబ్జి,యల్లపు సూర్యనారాయణ, వర్రె రాజు, వండ్రాసి సన్యాసి రావు, వండ్రసి వెంకటరావు, బెల్లంకొండ సీతారామ రాజు, అల్లాడ జగన్నాధ రావు, కర్ణం చంటి, కుండ్రపు అప్పారావు, కర్రీ రాంబాబు, కర్ణం లక్ష్మి, బుగిది రామలక్ష్మి, కొమరపు చిన్నబాబు,దేవర తాత రావు, వరుపుల సత్తిబాబు, శీరపు నాగరాజు, సారిపల్లి దేవుడు, పోలవరపు శేఖర్,గంధవరపు మురళీ, కొయ్యన నారాయణ రావు, సోక్కర రమణ, పసుపులేటి రంగా రావు, కెల్లా అప్పలరాజు, నమ్మి రమణ, చొప్ప శ్రీను,వారధి శ్రీను, చట్టి రాము, చట్టి తాత రావు, మామిడి సాంబశివరావు, దేవుడు, కర్రీ అంజి, చింతగడ కైలాష్, ద్రోనాద్రి సూరిబాబు, నమ్మి ధనజీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏయూ పూర్వ విద్యార్థుల భారీ విరాళం



విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సమయంలో ఏయూ పూర్వ విద్యార్థి, అమెరికాలోని వియాట్రిస్‌లో గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్-రెగ్యులేటరీ కమ్యూనికేషన్స్ హెడ్‌గా పనిచేస్తున్న డా.దేవా హెచ్.పురాణం రూ.70 లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో క్యాంపస్ బ్యూటిఫికేషన్‌కు రూ.50 లక్షలు, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు రూ.20 లక్షలు వెచ్చించనున్నారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వీసీ ఆచార్య రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశం ఉత్సాహంగా సాగింది. విశ్వవిద్యాలయం అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు, ముఖ్యంగా శతాబ్ది కార్యక్రమాలపై పూర్వ విద్యార్థులతో అర్థవంతమైన చర్చలు జరిపారు. పూర్వ విద్యార్థులు విరాళాలు, అకడమిక్ సహకారాన్ని అందించేందుకు ముందుకొచ్చారు. ఐఐటీ భువనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ రాజ్‌కుమార్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘానికి రూ.7.5 లక్షల విరాళం అందించారు.

# అండర్ పాస్ పనులను వెంటనే ప్రారంభించాలి

నెల్లూరు: చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద అండర్ పాస్ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, బ్రిడ్జి సాధన పోరాట కమిటీ కన్వీనర్ కాయంబు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అండర్ పాస్ ఏర్పాటు కోసం నగరంలోని ముత్తుకూరు గేట్ సెంటర్ నుంచి చింతారెడ్డిపాళెం వరకు మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చింతారెడ్డిపాళెం జంక్షన్‌ను దాటే సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి మంజూరైతే పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు మస్తాన్‌బీ, నాగేశ్వరరావు, సతీష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ




విశాఖపట్నం: నెలలు నిండకుండా పుట్టే(నవజాత) శిశువులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డేను పురస్కరించుకుని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ బాగ్చి మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రసవం జరిగితే వైద్యుల పర్యవేక్షణలో ఇటువంటి శిశువులను సంరక్షించడం సాధ్యపడుతుందన్నారు. ఆస్పత్రి నియోనటాలిజిస్ట్ డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ మాట్లాడుతూ సరైన సమయంలో చికిత్స అందిస్తే ఇటువంటి శిశువులను పూర్తిస్థాయిలో రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు గరుడ రాము, విద్య రమ, గీత వందన, రాధిక, కేటీవీ లక్ష్మణ్, విజయ్, మౌనిక, సెంటర్ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది.

# ఆధ్యాత్మికతతో మానసిక ఒత్తిడి దూరం

నంద్యాల: యాంత్రిక జీవనంలో ఉండే అధికారులు ఆధ్యాత్మిక త చింతనతో ఒత్తిడి దూ రమై మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి కబర్ది అన్నారు. జిల్లాలోని పలువురు జడ్జీలు నవనందుల యాత్ర చేపట్టారు. మొదట ప్రథమనందీశ్వరుడిని దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వారికి ఆల య ఈఓ ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం వారు అన్నదాన కార్యక్రమాల్లో పాలొన్నారు. ఆలయ నిర్వాహకులు జడ్జీలను శాలువాలతో సత్కరించి స్వామి వారి ప్రతిమలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్జిలు కమలాదేవి, అమ్మన్నరాజా, శ్రీవిద్య, రాజేంద్రబాబు, దివాకర్, శ్రీనివాసులు, కర్రి లక్ష్మి, నీలవెంకటశేషాద్రి పాల్గొన్నారు.



# అరకులో జియోథర్మల్ ఎనర్జీ టెక్నాలజీ




విశాఖపట్నం: ఇంట్రిగ్రేటెడ్ ఎనర్జీ సొల్యూషన్స్ కోసం అరకులోయలో ప్రపంచ ప్రామాణిక జియోథర్మల్ ఎనర్జీ టెక్నాలజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈఎస్‌ఎల్ సీఈవో అఖిలేష్ కుమార్ దీక్షిత్ వెల్లడించారు. రెండు రోజుల పాటు విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన నగరంలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. దీని ద్వారా 50 నుంచి 70 శాతం వార్షిక ఇంధన ఆదా చేయగలమని వెల్లడించారు. జియోథర్మల్ ఎనర్జీ టెక్నాలజీ ద్వారా అరకులో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం కూడా ఉందని తెలిపారు. పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం, నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై దీర్ఘకాలిక దృష్టి సారించడం ద్వారా ప్రజల ఆర్థిక వృద్ధికి, మెరుగైన జీవన నాణ్యతకు గణనీయంగా దోహదపడుతుందని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. విస్తృత శ్రేణి ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ, పరిశ్రమలు, పర్యాటక రంగాలతో కలిసి ఈఈఎస్‌ఎల్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈఎస్‌ఎల్ ప్రభుత్వ వ్యవహారాలు, మీడియా సలహాదారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఎరువు తయారీ కేంద్రంలో పరిశీలన




సంగం: మండలంలోని తరుణవాయిలో ఏర్పాటు చేసిన గుర్రపు డెక్క నుంచి ఎరువు తయారీ కేంద్రాన్ని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి సందర్శించారు. తయారీ విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గుర్రపుడెక్కను ఉపయోగించి ఎరువును తయారు చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని వివరించారు. జిల్లాలో మొదటగా సంగం మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామని వెల్లడించారు. గుర్రపుడెక్కతో ఎరువు తయారీకి 60 రోజుల సమయం పడుతుందని చెప్పారు. తయారయ్యాక అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో టెస్టింగ్‌కు పంపుతామని వెల్లడించారు. అక్కడ సత్ఫలితమొస్తే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కట్టిన షెడ్లను ఉపయోగించి.. మిగిలిన ప్రాంతాలకు సైతం విస్తరించే యోచనలో ఉన్నామని చెప్పారు. బాణా శ్రీనివాసులురెడ్డి, డీపీఎం మధుసూదన్, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను ఆరుబయట ఆడుకోనివ్వండి

**- అవగాహనతోనే చిన్నారుల్లో మయోపియా నివారణ**

**- ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్య నిపుణులు**




విశాఖపట్నం: చిన్నారుల్లో వచ్చే కంటి వ్యాధులపై అవగాహనను పెంచాల్సిన అవసరం ఉందని ఎల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచ మయోపియా అవగాహన దినం సందర్భంగా ఎల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రి, జీఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అదితి పారిఖ్ మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. చిన్నారులు అక్షరాలను, వస్తువులను చూడటంలో ఇబ్బందులు పడితే వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. మయోపియా వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తిస్తే.. సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యపడుతుందన్నారు. ఎల్.వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ క్యాంపస్ హెడ్ వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ చిన్నారులను సూర్యరశ్మి తగిలేలా ఆడుకోనివ్వాలన్నారు. తద్వారా మయోపియా వ్యాధి రాకుండా వారిని కాపాడటం సాధ్యపడుతుందన్నారు. పిల్లల్లో మయోపియా వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. అవగాహనతో దీనిని నివారించడం సాధ్యపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మయోపియాపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలో చిన్నారులు, నగరవాసులు, వైద్యులు, వైద్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పశుశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాటు

## -అధ్యక్షుడిగా మహేంద్ర

## -ప్రధాన కార్యదర్శిగా బాబునాయుడు



అనంతపురం : స్థానిక సాయినగర్‌లోని పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా పశుసంవర్ధకశాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఆల్ క్యాడర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా బి.మహేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఆర్.బాబునాయుడు, ఉపాధ్యక్షులుగా సి.వరప్రసాద్, ఏఎల్ సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.రామాంజనేయులు, ఎం.ఆదినారాయణ, కోశాధికారిగా టి.విశ్వనాథ్, అలాగే కమిటీ సభ్యులుగా ఎం.నాగపవన్, డి.ఆదినారాయణ, వై.రేవతి, ఎం.నరసింహులు ఎన్నికయ్యారు.

# విద్వాంసులకు చక్కని వ్యవస్థ అవసరం



రాజమహేంద్రవరం: విద్వాంసులు ఒక ప్రాంతంలో ఉండాలంటే చక్కని వ్యవస్థ ఉండాలని, గురుకులం అటువంటి వ్యవస్థను అందించడం ఆనందదాయకమని మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు, వేద విద్వాంసులు, వేద శాస్త్రాభిమానులు రచించిన వ్యాసాలతో.. కొంతమూరులోని శ్రీ దత్తాత్రేయ వేద విద్యా గురుకులం వెలువరించిన 'వేద పరిరక్షణం %-% సర్వ జగద్రక్షణం' రజతోత్సవ స్మరణ సంచికను ఆయన ఆవిష్కరించారు. తొలి ప్రతిని నగర ప్రముఖుడు దాట్ల బుచ్చి వెంకటరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ ప్రసంగించారు. గురుకులం కార్యదర్శి, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ, నగరంలో ఎక్కడ వేదస్వస్తి జరపాలన్నా గురుకులం విద్యార్థులు కావాలని కోరుతున్నారని అన్నారు. ఎందరో ఆచార్యులు, వేద విద్వాంసులు, పీఠాధిపతులు, ప్రవచనకర్తల పాదస్పర్శతో పునీతమైన గురుకులం విశ్వవ్యాప్త ప్రాచుర్యాన్ని సంతరించుకున్నదని హర్షం వ్యక్తం చేశారు. కర్ణాటక ధార్వాడ్‌కు చెందిన ప్రముఖ వేద విద్వాంసుడు రాజేశ్వరశాస్త్రి జోషి, ప్రవచన రాజహంస ధూళిపాళ మహాదేవమణి, మహామహోపాధ్యాయులు శలాక రఘునాథశర్మ, దోర్భల ప్రభాకరశర్మ, గుల్లపల్లి ఆంజనేయ ఘనపాఠి, కొంపెల్ల సత్యనారాయణశాస్త్రి, ప్రముఖ సాంస్కృతిక విద్వాంసుడు కందుకూరి రామసూర్యనారాయణ తదితరులు ప్రసంగించారు. రజతోత్సవాలను విజయవంతం చేస్తున్న ప్రతి ఒక్కరికీ వేద విద్యా గురుకులం వ్యవస్థాపకుడు, ప్రధానాచార్యుడు గుల్లపల్లి సీతారామాంజనేయ ఘనపాఠి ధన్యవాదాలు తెలిపారు. సీతారామాంజనేయ ఘనపాఠి దంపతులకు జరిగే షష్టిపూర్తి సత్కార సభతో రజతోత్సవాలు ముగియనున్నాయి.

# గిరిజనులకు బ్రిటిష కాలం కంటే ఇప్పుడే ఎక్కువ అన్యాయం

**- ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త పూర్ణచంద్రరావు**




విశాఖపట్నం: గిరిజనులకు బ్రిటిష్ వారి కాలం కంటే ఇప్పుడే ఎక్కువ అన్యాయం జరుగుతోందని ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, తెలంగాణ మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ(ఏఐబీఎస్పీ) ఆధ్వర్యంలో ఆదివాసుల రాజ్యాంగ హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సును ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్ వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్ల కాలంలో చెప్పింది చేసే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం పాలక పక్షాలు చెప్పేదొకటి చేసేది మరొకటిగా తయారైందన్నారు. యథేచ్ఛగా గిరిజనుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని రాష్ట్రంలో అమలు చేసే దిక్కులేకుండా పోయిందన్నారు. గిరిజనుల్లో 60 నుంచి 70 శాతం నిరక్షరాస్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆదివాసులకు కనీసం మాతృభాష బోధించలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా గిరిజనుల హక్కుల పరిరక్షణకు, అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లింగయ్య దొర, రాష్ట్ర సమన్వయకర్త లకే రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# కాపులను ఒకే వేదికపైకి తీసుకొస్తాం



కాకినాడ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాపులను త్వరలో ఒకే వేదికపైకి తీసుకువచ్చి కొత్త సంఘం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కాకినాడలో శుభం కాపు కల్యాణ మండలంలో కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురు చూడకుండా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి సమాజంలో మంచి నడవడిక నేర్పించాలన్నారు. కాపులంటే ఇలానే ఉండాలనే విధంగా పెంచాలని సూచించారు. కాపులకు ఒక చరిత్ర ఉన్న విషయం అందరికీ తెలిసే విధంగా సంఘీయులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి సంఘం ఏర్పాటు చేసి, కాపులకు ఏ కష్టం వచ్చినా సహాయం చేసే విధంగా పని చేస్తామన్నారు.

# బీసీలను నమ్మించి మోసం చేస్తే ఉద్యమమే..'

### 'ర్యాలీలో పాల్గొన్న వీహెచ్, శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా ఇస్తే ఒప్పుకొనే ప్రసక్తే లేదని, చట్టబద్ధంగా ఇవ్వాలని తెలంగాణ బీసీ ఐకాస నేతలు డిమాండ్ చేశారు. నమ్మించి మోసం చేస్తే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ కూడలి నుంచి ట్యాంకు బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు 'రన్ ఫర్ జస్టిస్' పేరిట భారీ ర్యాలీని నిర్వహించారు. బీసీ ఐకాస కార్యనిర్వాహక అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐకాస నేత గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా తొందరపడి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీలు కచ్చితంగా గుణపాఠం చెబుతారన్నారు. వెంటనే అఖిలపక్షంతో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. క్యాబినెట్ సమావేశంలో దిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లే తేదీని నిర్ణయించాలని డిమాండ్ చేశారు.



ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపాలని, లేకుంటే డిసెంబరు మొదటివారంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఐకాస నేతలు శ్రీనివాస్ ముదిరాజ్, గణేశ్ చారి, వీరాస్వామి, విక్రమ్ గౌడ్, శ్యామ్ కురుమ, శేఖర్ సగర, మల్లయ్య, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, మధు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో బూతులు మాట్లాడేవారిని ప్రోత్సహించొద్దు



హైదరాబాద్: 'రాజకీయాల్లో ఉన్న వారు మాట్లాడుతున్న బూతులు తట్టుకోలేకపోతున్నాం. ఇళ్లలో ఉండే ఆడ వారి గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదు. ఇలాంటి వారికి పోలింగ్ కేంద్రాల్లోనే సమాధానం చెప్పాలి. మొన్నటి ఎన్నికల్లో అసభ్యకరంగా మాట్లాడే నాయకులు ఎవరూ గెలవలేదు. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దు' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రజలను కోరారు. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు జి.కృష్ణ రచించిన 'అప్పుడు-ఇప్పుడు', సీనియర్ పాత్రికేయుల 'అనుభవాలు-జ్ఞాపకాలు' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పాత్రికేయులు దేశ నిర్మాణంలో క్రియాశీల పాత్ర పోషించాలని కోరారు. రాజకీయ పక్షాలు తమ బాధ్యతను విస్మరించి ఇతరులపై నెపం వేయడం తగదన్నారు. ఆక్రమణలు తొలగిస్తూ హైడ్రా కమిషనర్ మంచి పనులు చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియాకు జవాబుదారీతనం ఉండే విధంగా సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, ఎస్.వెంకట నారాయణ, ఉదయవర్లు, రాజశుక తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు మేలు చేసేలా కవిత వ్యాఖ్యలు

### భారత రాష్ట్ర సమితి విప్ కేపీ వివేకానంద

హైదరాబాద్:కాంగ్రెస్‌కు మేలు చేసేలా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలున్నాయని భారత రాష్ట్ర సమితి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ట్రాప్‌లో పడి కవిత భారత రాష్ట్ర సమితిపై విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. "ఎవరి ప్రయోజనం కోసం ఇలా వ్యవహరిస్తున్నారు? కేసీఆర్ కుమార్తెగా కవితను గౌరవిస్తున్నాం.. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. ఏదైనా మాట్లాడుతామంటే రియాక్షన్ కూడా అదే రీతిలో ఉంటుందన్న విషయాన్ని గుర్తెరగాలి. పదేళ్లు అధికారం అనుభవించినప్పుడు లేని తప్పులు కవితకు ఇప్పుడెలా గుర్తుకు వస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఎలాంటి సంబంధం లేదని చెప్పి.. ఫలితాలు విడుదలైన తర్వాత భారత రాష్ట్ర సమితి నేతలకు




వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడి కాంగ్రెస్ గెలిచిన విషయం తెలియదా? తాను చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని వివేకానంద పేర్కొన్నారు.

# పార్టీ, ప్రభుత్వ సమన్వయ వ్యవస్థలన్నీ ప్రక్షాళన చేయాలి: సంపత్‌కుమార్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధించాం కదా అని ఆదమరిచి వ్యవహరిస్తే ఆగమైపోతామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి, మీనాక్షి, మహేశ్‌కుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఇప్పటివరకూ అంతా మంచిగా ఉందన్నారు. ప్రస్తుతం పార్టీ, ప్రభుత్వాన్ని సమన్వయపరిచే అన్ని వ్యవస్థలను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని, దీనిపై దృష్టి పెట్టాలని కిందిస్థాయి నుంచి ఏఐసీసీ కార్యదర్శిగా ఎదిగిన అనుభవంతో రేవంత్‌రెడ్డి, మీనాక్షిలకు చెబుతున్నానని ఆయన తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శిగా తన పనితీరును కూడా పరిశీలించాలని సూచించారు. మంచి వాతావరణంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు పార్టీని పునర్నిర్మాణం చేయాలని రేవంత్‌రెడ్డి, మీనాక్షిలకు విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



ఇది తన ఒక్కడి ఆలోచన కాదని, 42 లక్షలమంది కాంగ్రెస్ కార్యకర్తల మనోభావమని సంపత్‌కుమార్ తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తే అంగీకరించం

### బీసీల న్యాయ సాధన దీక్షలో వక్తల స్పష్టీకరణ

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ ఐకాస ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో 'బీసీల న్యాయ సాధన దీక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇస్తే అంగీకరించబోమని స్పష్టం చేశారు. సంబంధిత రిజర్వేషన్ల కోసం ఏడాదిగా పోరాడుతున్నామని.. దీనిపై నెల రోజుల్లో హైకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ తీర్పు బీసీలకు అనుకూలంగా



ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడక ముందే ఎన్నికలకు వెళ్తే.. పెద్దఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో 45 బీసీ కుల సంఘాలు, 39 బీసీ సంఘాల ప్రతినిధులతో పాటు బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.

# జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

### కేంద్ర ప్రభుత్వ అధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్: జిన్నింగ్ మిల్లు యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని, సీసీఐ నిబంధనలను సడలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వ అధికారులకు సూచించారు. సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ కార్యాలయ కార్యదర్శి, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. "సీసీఐ అమలు చేస్తున్న ఎల్1, ఎల్2 నిబంధనలతో రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు నష్టపోతున్నారు. తేమ శాతం, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి నిబంధనలతో రైతులూ అల్లాడుతున్నారు. తుపాను వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు ఇప్పటికే భారీగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో నిబంధనల పేరిట మిల్లర్లను, రైతులను ఇబ్బందులకు



గురిచేయడం భావ్యం కాదు. మానవతా దృక్పథంతో కొనుగోలు నిబంధనలను ఎత్తివేసి, జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించే దిశగా సీసీఐ అధికారులను ఆదేశించాలి" అని మంత్రి కోరారు.

# కొత్త విద్యుత్కేంద్రాలపై కీలక నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వ్యయంతో కొత్త విద్యుత్కేంద్రాల నిర్మాణం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వీటిలో రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు, 1500 మెగావాట్ల బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థ, 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంటు (పీఎస్‌పీ)లు ఉన్నాయి. వీటి నిర్మాణానికిచ్చిన ప్రతిపాదనల ప్రకారం భారీగా కొత్త రుణాలను సేకరించేందుకు రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)కు ప్రభుత్వం అనుమతివ్వాలి. ఆయా ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ పంపింది. ఇవి కాకుండా ప్రైవేటు కంపెనీలు నిర్మించే మరో 2,500 పీఎస్‌పీల అనుమతి కోసం కూడా మంత్రివర్గం ముందు పెట్టబోతున్నారు. ప్రతిపాదనల ప్రకారం వీటి నిర్మాణాలు పూర్తయ్యేసరికి ఆరేడేళ్లు పడుతుంది. రామగుండంలో నిర్మించబోయే థర్మల్ ప్లాంటుకు జెన్‌కో రూ.10,893 కోట్లు వ్యయం చేయాలి. ఇందులో 75% రుణాలుగా తీసుకోవాలి. మిగిలిన 25%(రూ.2,723 కోట్లు) ఈక్విటీ కింద జెన్‌కోనే సొంతంగా పెట్టుబడి పెట్టాలి. ప్రస్తుతమున్న థర్మల్ ప్లాంట్ల కోసం రోజూ సింగరేణి గనుల నుంచి కొంటున్న 50 వేల టన్నుల బొగ్గుకే సొమ్ములు చెల్లించలేక జెన్‌కో రూ.12 వేల కోట్ల బకాయిలు పెట్టింది. ఈ క్రమంలో జెన్‌కో కొత్తగా నిర్మించే థర్మల్ ప్లాంటుకు రూ.2,723 కోట్ల పెట్టుబడికి మంత్రివర్గం అనుమతిస్తే ఆ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాల్సి ఉంటుందని అంచనా. రామగుండం సమీపంలోనే పెగడపల్లిలో నిర్మించబోతున్న 800 మెగావాట్ల కొత్త ప్లాంటుకు నిర్మాణ అంచనా వ్యయం మెగావాట్‌కు రూ.13.33 కోట్లు అవుతుండగా.. జెన్‌కో ప్లాంటుకు రూ.13.62 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదించారు. సిపెట్ ప్రాంతంలో ఎన్టీపీసీ నిర్మిస్తున్న కొత్త ప్లాంటుకు మెగావాట్‌కు



రూ.12.82 కోట్లే అవుతోంది. అధిక వ్యయంతో నిర్మించే జెన్‌కో థర్మల్‌ప్లాంటు పూర్తయితే యూనిట్ కరెంటు ఉత్పత్తి వ్యయం రూ.7.97 అవుతుందని అంచనా. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం వద్ద 750 మెగావాట్లు, యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో మరో 750 మెగావాట్ల చొప్పున బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థలు ఏర్పాటు చేయడానికి జెన్‌కో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంటు నిర్మిస్తే సగటున యూనిట్ కరెంటుకు రూ.6.60 అవుతుందని జెన్‌కో అధ్యయనంలో తేలింది. వీటి వల్ల ఏటా రూ.1000 కోట్ల లాభం వస్తుందని తెలిపింది. ఇక ప్రైవేటు కంపెనీలు నిర్మించే మరో 2వేల మెగావాట్ల పీఎస్‌పీలను 'డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్'(డీబీఎఫ్‌ఓటీ) అనే విధానంలో చేపడతామని మంత్రివర్గానికి జెన్‌కో తెలిపింది. ఈ విధానంలో రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే ఆర్థికభారం ఉండదని వివరించింది. ఈ ప్రాజెక్టులనుంచి వచ్చే కరెంటుకు యూనిట్‌కు రూ.4.86 చొప్పున జెన్‌కో చెల్లించాల్సి ఉంటుంది.

# ఉప రాష్ట్రపతికి గవర్నర్, సీఎం ఘన స్వాగతం

### రాజ్‌భవన్‌లో తేనీటి విందు

హైదరాబాద్: రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొనడానికి హైదరాబాద్‌కు విచ్చేసిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని రాధాకృష్ణన్ స్వీకరించారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన.. అక్కడ సుమారు 30 నిమిషాల పాటు ఉన్నారు. గవర్నర్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఉపరాష్ట్రపతితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం రామోజీ ఫిల్మ్‌సిటీకి బయలుదేరి వెళ్లారు. అక్కడ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న అనంతరం ఉపరాష్ట్రపతి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తిరిగి దిల్లీకి బయలుదేరి వెళ్లారు. గవర్నర్, మంత్రులు, అధికారులు, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు వీడ్కోలు పలికారు.



ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి శ్రీధర్‌బాబు

# ప్రభుత్వ పనితీరుకు జూబ్లీహిల్స్ గెలుపు నిదర్శనం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలవడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి నిధులు రూ.3.60 కోట్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని 2, 3, 5, 12, 13 వార్డుల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. నిరుపేదలకు ఇళ్లు ఇస్తే కమీషన్లు రావనే మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 తగ్గకుండా ఇళ్లు ఇచ్చాం. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఐటీడీఏ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇళ్లు మంజూరు చేశాం' అని పొంగులేటి తెలిపారు. ఇల్లెందు పట్టణంలోని అర్హులకు సైతం



ఐటీడీఏ ద్వారా ఇళ్లు కేటాయించాలని వేదికపై ఉన్న పీఓ రాహుల్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రక్తనిల్వ కేంద్రాన్ని ప్రారంభించడంతోపాటు, జేకే కాలనీలో అసంపూర్తిగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు, రాజీవ్‌గృహకల్ప ఇళ్లను పరిశీలించారు. మంత్రి వెంట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు ఉన్నారు.

# సమాన పనికి సమాన వేతనం

**-సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్**
**-రంపచోడవరంలో సంఘ మహాసభలు ప్రారంభం**



రంపచోడవరం: రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రంపచోడవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రారంభమైన జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. రంపచోడవరం పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీలో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఐటీయూ నాయకులు పాల్గొని ప్రసంగించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ కనీస వేతన విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. దీనివల్ల కార్మికులకు ప్రతీ రోజు రూ. 180 వేతనం అందుతుందన్నారు.పని గంటలను 8 నుంచి 13కు పెంచేందుకు ప్రయత్నిస్తుందని దీని వల్ల పెట్టుబడిదారులకు లాభం చేకూరుతుందన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ఏజెన్సీలో పర్యటించిన ఒడిశా సీఎం గతంలో గిరిజన మహిళలు నల్లగా ఉంటారని వారిని కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. అటువంటి వ్యక్తి ఈ ప్రాంతంలో పృటించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. అలాగే హైడ్రో ప్రాజెక్టు పేరుతో పాడేరు, అరకు ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదలను కార్పొరేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దీనిని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. వివిధ రంగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలే కాంట్రాక్ట్ ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, మిడ్ డే మీల్స్ వర్కర్లను, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ చార్జీ భారాన్ని మోపుతున్నాయన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారని ఇప్పుడు ఆయనే స్మార్ట్ మీటర్లను బిగించాలని అధికారులను ఆదేశిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, పి సంతోష్ , నిర్మల పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను తుద ముట్టించాలి

**-అవగాహన కోసమే సైకిల్ యాత్ర**



బుచ్చయ్యపేట: మాదక ద్రవ్యాలు లేని సమాజమే లక్ష్యమని, గంజాయి నిర్మూలనే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అభ్యుదయం పేరుతో పోలీసు శాఖ సైకిల్ యాత్ర చేపట్టిందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. పెండింగ్ కేసుల ప్రగతిని కచ్చితంగా పరిశీలించి, అవసరమైన సూచనలు అందించారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు, తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాల నివారణ కోసం గ్రామ స్థాయిలోనే ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత వివరాలను రహస్యంగా ఉంచుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఐలు ఏ.శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలు కార్మిక వ్యతిరేకం

**-విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులను అవమానించారు: సిటు**



అనకాపల్లి: స్టీల్‌ప్లాంట్ కార్మికులు పనిచేయకపోవడం వల్లే పరిశ్రమ నష్టాల బారిన పడిందని, కష్టపడకుండా తెల్ల ఏనుగులా కార్మికులు మారారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేయటం అత్యంత దుర్మార్గమని, ఈ వ్యాఖ్యలను సీఎం చంద్రబాబు తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్.శంకర్‌రావులు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకుండా, ఎక్కువ ఖర్చువడం మూలంగానే స్టీల్‌ప్లాంట్‌కు భారంగా మారిందన్న విషయం తెలిసి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విధంగా వ్యాఖ్యలు చేయటం అత్యంత దుర్మార్గమన్నారు. జిల్లాలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ప్రారంభం కాకుండానే సొంత గనుల కోసం ప్రధానితో మాట్లాడి తీసుకొస్తున్నానని ఘనంగా చెప్పడంతో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కూటమి ప్రభుత్వం ఏ విధంగా దాసోహం అయిందో అర్థం అవుతుందన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకుంటే, దానిని విస్మరించి చంద్రబాబునాయుడు మిట్టల్ సంస్థకు దాసోహం అయ్యారన్నారు. సిటు జిల్లా కమిటీ సభ్యుడు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విమర్శలు అత్యంత బాధాకరమని, వాస్తవాలకు విరుద్ధమని, ఉక్కు కార్మికులను 'తెల్ల ఏనుగులు' అంటూ అవమానించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న వేలాది కార్మికుల కష్టాన్ని, త్యాగాన్ని గుర్తించకుండా ఇలాంటి చౌకబారు వాక్యాలు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, సొంత గనులు లేకపోవడం, ఇతర పాలనాపరమైన కారణాల వల్ల నష్టాలు వస్తుంటే నెపం కార్మికులపై నెట్టడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉండగా విశాఖ ఉక్కు కార్మికుల ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ మద్దతుగా నిలిచిందని, మరి ఇంతలోనే కార్మికులు పనిచేయకుండా తెల్ల ఏనుగును చేసేశారని ముఖ్యమంత్రి అనడం సరైనది కాదన్నారు. కార్మికుల సమస్యలు వినకుండా వారిపై 'పీడీ యాక్ట్ పెట్టి లోపల వేస్తాం' అని ముఖ్యమంత్రి బెదిరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

# రబీకి పుష్కలంగా సాగునీరు

**- ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్**



నెల్లూరు: జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగు చేసే ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నామని ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్ తెలిపారు. డెల్టా పరిధిలోని కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు నియోజకవర్గాలకు సంబంధించి 97 వేల ఎకరాల నీటిని పెన్నాబ్యారేజ్ నుంచి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐఏబీ తీర్మానం మేరకు జిల్లాలో 7.27 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టాకు 5.04 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా అధికారులు నిర్ణయించారు. ఇందులో పెన్నార్ డెల్టాలో 2,15,552 ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేల ఎకరాలు, కావలి కాలువ కింద లక్ష ఎకరాలకు, జీకేఎన్ కాలువ కింద 75 వేల ఎకరాలు, దక్షిణ కాలువ కింద 48 వేల ఎకరాల ఆయకట్టుకు 50.455 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ కింద కేఆర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ కింద 17,475 ఎకరాలకు, ఎస్ఎస్‌జీ కెనాల్ కింద 30,209 ఎకరాలకు, ఎస్ఎస్‌జీ మెయిన్ కెనాల్ కింద (తిరుపతి పరిధిలో) 1,75,649 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 22.33 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. రైతులు నీటి వృథా చేయకుండా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి, సర్వేపల్లి నీటి యాజమాన్యం సంఘం అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జవహర్ కాలువ నీటి యాజమాన్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, డెల్టా నీటి యాజమాన్య సంఘం అధ్యక్షుడు శివనాయుడు, ఏఈలు బాలు సుబ్రహ్మణ్యం, మహేష్ పాల్గొన్నారు.

# ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలి



రాయచోటి : దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు సంబంధించిన ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాయచోటిలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రమోషన్ ఛానల్ లేక ఉపాధ్యాయులు ఏళ్లతరబడి ఒకే కేడర్‌లో కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2016లో విడుదల చేసిన జీఓలు 72,73,74 అమలు కావడం లేదన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ కొందరు స్వార్థపూరిత అధికారులు జీఓలను అమలు చేయడం లేదన్నారు. మండల, జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో పీజీటీ కేడర్ ఉపాధ్యాయులు సైతం పదోన్నతికి నోచుకోవడం లేదన్నారు. కావున సర్వీస్ రూల్స్ విధానాన్ని పరిష్కరించుటకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ప్రమోషన్స్‌లో ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ వివిధ మేనేజ్‌మెంట్ వారికి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 72,73,74 జీఓలను అమలు చేసి డీవైఈఓ జెయల్, యంఈఓ, డైట్ లెక్చరర్స్‌గా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, దావుద్దీన్, పురం వెంకటరమణ, ఆదినారాయణ, రమణమూర్తి, అక్రం బాషా, భాస్కర్‌రెడ్డి, విజయ్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఫయాజ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# హక్కులను పరిరక్షించుకోవాలి



ఏలూరు : సమాచార హక్కు చట్టం దేశ పౌరులకు అందిన గొప్ప ఆయుధమని, సమాజంలో జరిగే అవినీతిని రూపుమాపడానికి, ప్రజలు తమ హక్కులను పరిరక్షించుకోవడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ జా తీయ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ప్రారంభించారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను, చట్టంలోని ప్రధాన అంశాలను వివరించారు. అనంతరం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం (ఏలూరు) ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, బి.రమేష్, 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నాన్ అకడమిక్ అంశాలు తగ్గించాలి



ఏలూరు : ఉపాధ్యాయులపై ఒత్తిడికి కారణమవుతున్న నాన్ అకడమిక్ అంశాలు పూర్తిగా తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు స్థానిక సేవాభారతి కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. అఖిల భారతీయ ఉపాధ్యాయ సంఘం జాతీయ కార్యదర్శి జి.లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో జాతీయ భావాలను పెంపొందించాలని సూచించారు. జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షా విధానాల్లో మార్పులు అవసరమన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన 100కు పైగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయా సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాధ్యుడు క్రొవ్విడి రాజకుమార్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సతీష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు



నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో గడిచిన రెండు రోజులగా జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి మొత్తం 300 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరై సత్తా చాటారు. వివిధ జిల్లాలకు చెందిన లిఫ్టర్లు ఆయా విభాగాల్లో బరువులెత్తి పతకాలు సాధించారు. విజయనగరం జిల్లాకు చెందిన 12 మంది పురుషులు, ఏడుగురు మహిళలు సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. కడప, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అందరికీ సమన్యాయం అందరి హక్కు

**-న్యాయ సేవలను వినియోగించుకోండి**
**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత**



విజయనగరం: ఉచిత న్యాయసహాయం, సమన్యాయం పొందడం అందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాలకు చెందిన వారు ఉచిత న్యాయసహాయం, సలహాలు పొందే అవకాశాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తోందని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, అవగాహన కార్యక్రమాన్ని భోగాపురం మండలంలోని నందిగామ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత మాట్లాడుతూ ఆదాయం రూ.3లక్షల కంటే తక్కువ ఉన్న పేదలు, మహిళలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తదితర బలహీన వర్గాలకు చెందినవారు డీఎల్ఎస్ఏని సంప్రదించవచ్చని సూచించారు. లోక్ అదాలత్‌లు నిర్వహించడం, న్యాయ అవగాహన కల్పించడం బాధితులకు అండగా నిలవడం దీని లక్ష్యాలని వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 15100 జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, డీఎల్ఎస్ఏను నేరుగా సంప్రదించడం ద్వారా లేదా టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయడం ద్వారా కూడా న్యాయ సహాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాలని కోరారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికీ రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని, వాటికి ఉల్లంఘన కలిగినప్పుడు, పరిరక్షించడానికి వివిధ చట్టాలు ఉన్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా వల్ల మంచితో పాటు కొంత చెడు కూడా ఉందన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఇటీవల కొన్ని మోసాలు జరుగుతున్నాయని, ఇలాంటివి ఎవరికైనా ఎదురైనప్పుడు ధైర్యంగా ఉండాలని, భయపడవద్దని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పేదలు, బలహీన వర్గాలకు డీఎల్ఎస్ఏ ద్వారా అందించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఎస్.కోట, చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, కురుపాం న్యాయసేవాధికార సంస్థల ద్వారా మండల స్థాయిలో కూడా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీమోహన్ ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కకా వికలం.. ఇండీ కూటమికీ ముప్పు?!



దేశంలో అతిపెద్ద పురాతన పార్టీగా కొన్ని దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి డోలాయమానంలో పడింది. ఒకరకంగా చెప్పాలంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఆ పార్టీ పరిస్థితి మారింది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కేవలం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే ఆ పార్టీ విజయం దక్కించుకుంది. అది కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభావం కంటే స్థానికంగా ఉన్న నాయకుల ప్రభావంతోనే పార్టీ విజయం దక్కించుకున్న వాదన వినిపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొక్క బోర్ల పడింది. కనీసం గతంలో జరిగిన ఎన్నికల్లో దక్కించుకున్న స్థానాలను కూడా ఇప్పుడు దక్కించుకోలేకపోయింది. ఇక వచ్చే ఏడాది కీలకమైన రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వచ్చే ఆరు మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారాయి. ఈ రెండు రాష్ట్రాలు కాంగ్రెస్‌కు పెద్ద బలం లేనటువంటి రాష్ట్రాలనే చెప్పాలి. తమిళనాడులో డిఎంకే, పశ్చిమబెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం కొనసాగుతున్నాయి. ఇవి రెండు ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలే అయినప్పటికీ కాంగ్రెస్తో కలిసి రాష్ట్ర స్థాయిలో పోటీకి మాత్రం విముఖత వ్యక్తం చేస్తున్నాయి. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పొత్తులపై క్లారిటీ వస్తుందని అందరూ భావించారు. కానీ, ఇప్పుడు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేలమట్టం కావడంతో పాటు రాహుల్ గాంధీ ప్రభావం ఎక్కడ కనిపించకపోవడంతో తమిళనాడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలుగా ఉండి అధికారం కొనసాగిస్తున్న డీఎంకే, తృణమూల్ పార్టీలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేయడం ఖాయం.

# నవీన్ యాదవ్‌కు మంత్రి పదవి.. తీవ్ర కసరత్తు?



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ దక్కించుకుని విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు మంత్ర వర్గంలో చోటు లభించనుందా? ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తు న్నారా? అంటే.. ఔననే అంటున్నారు కాంగ్రెస్ పార్టీనాయకులు. ఇది అతిశయోక్తి కాదని కూడా చెబుతున్నారు. ప్రస్తుతం జూబ్లీ విజయంతో కాంగ్రెస్ జోష్ పెరిగింది. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా పరోక్షంగా మరిన్ని ప్రయోజనాలను ఆశించాలని ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్‌కు హైదరాబాద్‌లో బలమైన కేడర్ ఉంది. అదేవిధంగాఓటు బ్యాంకు కూడా ఉంది. 2023లో జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్ లో బీఆర్ఎస్ పట్టు పెంచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు కోల్పోయినా.. భాగ్యనగరంలో దూకుడు పెంచింది. ఫలితంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ పల్టీలు కొట్టింది. దీని నుంచి తాజాగా జూబ్లీహిల్స్ హస్తం పార్టీకి పరువు కాపాడింది. ఈ నేపథ్యంలో వచ్చే స్థానిక ఎన్నికల నాటికి మరింత పట్టు పెంచేందుకు నవీన్ యాదవ్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించడం సరైన చర్య అవుతుందన్న ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు పెద్ద పీట వేస్తామని చెబుతున్న నేపథ్యంలో నవీన్ యాదవ్‌కు ఆ దిశగా మంత్రివర్గంలో చోటు ఇస్తే.. అది బీసీ సామాజిక వర్గంలో కాంగ్రెస్‌కు ఉన్న సానుభూతిని పెంచు తుందన్న ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. దీనిపై ఆయా వర్గాల్లో ఆశలు కూడా నెలకొన్నాయి.

# ఇది కదా అభివృద్ధి వికేంద్రీకరణ



ఏపీ సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ నిజంగా ప్రత్యేకం. ఏపీ పునర్నిర్మాణానికి తాను కట్టుబడి ఉన్నానని సీఎం పలుసార్లు చెప్పారు. పరిపాలనలో ఆయన వేసే ప్రతి అడుగులో ఈ స్పష్టత కనిపిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ఒక స్పష్టమైన మాస్టర్ ప్లాన్ రూపొందించి, దాన్ని అమలు చేయడానికి ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నారు. అలాగే విశాఖపట్నం, తిరుపతి నగరాల అభివృద్ధికి కూడా మాస్టర్ ప్లాన్ సిద్ధం అవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల సిద్ధాంతం పూర్తిగా ఫ్లాప్ అయిందని ప్రజలు ఇచ్చిన తీర్పు స్పష్టంగా చెబుతోంది. అమరావతిపై అక్కసుతోనే ఆ నిర్ణయం తీసుకున్నారని తెలుగుదేశంపార్టీ ఆరోపించింది. ఇదే సమయంలో ఒకటే రాజధాని అది అమరావతి అన్న విషయాన్ని స్పష్టంగా తెలిపింది. అభివృద్ధి అనేది వికేంద్రీకరణతో రావాలని కూడా ప్రకటించింది. ఈ దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇక అభివృద్ధి ఒక్క అమరావతిలోనే కాకుండా విశాఖ, తిరుపతి నగరాల్లో కూడా ఐటీ, పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాలను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. నగరాభివృద్ధి ప్రణాళికలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలతో పౌరులకు మెరుగైన వసతులు, పచ్చదనం, ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ వచ్చే అవకాశం ఉండటంతో మరిన్ని పరిశ్రమలు కూడా రావచ్చని అంచనా. కొత్త కంపెనీలకు అవసరమైన భూసముపార్జన, అనుకూల వాతావరణం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. విశాఖను ప్రముఖ పెట్టుబడి కేంద్రంగా మార్చడం లక్ష్యం. అమరావతి, తిరుపతి, విశాఖ పట్నాల్లో హాస్పిటాలిటీ రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ హొటల్ యూనిట్లను స్థాపించేందుకు ప్రోత్సాహాలు ఇవ్వనుంది. ఈ మూడు ఆర్థిక కారిడార్ల అభివృద్ధి పర్యవేక్షణ కోసం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించనున్నట్లు వెల్లడించింది. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా బీచ్ టూరిజానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ విధంగా ఏపీ లోని మూడు ప్రధాన నగరాలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని కొత్త దారిలో నడపాలని ప్రభుత్వం భావిస్తోంది.

# రాజకీయాల్లోకి రంగా కుమార్తె!




త్వరలో వంగవీటి రంగా కుమార్తె ఆశాకిరణ్ రాజకీయాల్లోకి రానున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆమె ప్రకటించారు. విజయవాడలో తండ్రి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రంగా ఆశయ సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. వంగవీటి రాధా రంగా మిత్రమండలి మధ్య గ్యాప్ ఉందని అన్నారు. పదేళ్ల నుంచి తాను పబ్లిక్ లైఫ్ నుంచి దూరంగా ఉన్నానని తెలిపారు. ఇప్పుడు క్రియాశీలకంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆమె తెలిపారు. రాధా రంగా మిత్రమండలి సభ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. తాను ఏ పార్టీలో చేరతాను అనేది రాధా రంగా మిత్రమండలి పెద్దలతో కలిసి భవిష్యత్తులో నిర్ణయిస్తానని అన్నారు. తనకు అన్న రాధాకు ఎటువంటి భేదాభిప్రాయాలు లేవన్నారు. ఆయన మద్దతు తనకు ఉంటుందని నమ్ముతున్నానని తెలిపారు. రాజకీయంగా ఆయన నిర్ణయాలు ఆయనవి, తన నిర్ణయాలు తనవి అన్నారు. ఏపీ రాజకీయాల్లో వంగవీటి రంగా పేరు తెలియని వారు ఉండరు. 80వ దశకంలో ఆయన కాపు సామాజిక వర్గ నేతగా, బెజవాడ ప్రాంతంలో బలమైన రాజకీయనేతగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1985లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1988 లో ఆయన హత్యకు గురయ్యారు. అప్పట్లో ఆ ఘటన సంచలనం రేకెత్తించింది. ఆయన కుమారుడు వంగవీటి రాధా ఒకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ప్రజారాజ్యం, వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం టీడీపీలో ఉన్న ఆయన అంత యాక్టివ్ గా లేరు. రంగా కుమార్తె ఆశకిరణ్ 20 ఏళ్ల కిందట తన తల్లికి బాసటగా ఆమె రాజకీయాల్లో ప్రచారం చేశారు. అనంతరం ఇప్పుడే బయటికి వచ్చారు. ఆమె వైసీపీలో చేరుతారని ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# సి ఐ ఐ భాగస్వామ్య సదస్సు సూపర్ సక్సెస్

**- వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్**




విశాఖపట్నం, చైతన్యవారధి: సిఐఐభాగస్వామ్య సదస్సు ఊహించిన దాని కంటే విజయవంతం అయిందని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కొనియాడారు. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఆంధ్రపదేశ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీర్చిదిద్దుతున్నారన్నారని తెలియజేసారు. సి ఐ ఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావటంతో వైసీపీ నేతలకు మింగుడు పడటం లేదు. పెద్దఎత్తున ఒప్పందాలు జరగటంతో వైసీపీ నేతలు బయపడుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. కోడిగుడ్డు మంత్రి గా పేరొందిన అమర్ నాథ్ మీరు ఐదు ఏళ్లు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని వ్యాఖనించారు. దేశ విదేశాలు తిరిగి పెద్ద ఎత్తున పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ కష్టపడ్డారు అని చెప్పారు. దీని ఫలితమే సదస్సు విజయవంతం అయింది. మీ హాయంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో అద్దె కోట్లు, నకిలీ సంస్థలతోనే మీకు ఒప్పందాలు జరిగాయి. అందుకే ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదు వ్యాఖ్యనించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆనాడు హైదరాబాద్ ను హైటెక్ సిటీని అభివృద్ధి చేయగా, నేడు విశాఖను గూగుల్ సిటీ గా అభివృద్ధి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం లో సదస్సులో మావి నిజమైన లెక్కలు అమర్నాథ్ హాయంలో సదస్సులో కోడిగుడ్డు కథలు వినిపించారు. జగన్ హాయంలో పెట్టుబడి మ్యాప్‌లో నుంచి ఆంధ్రపదేశ్ మాయమైంది. మా మీద ఆరోపణలు పెట్టే ముందు వైసీపీ హాయంలో వచ్చిన కంపెనీలు చూపించండి. స్టేజ్‌పై కూర్చోబెట్టడం కాదు పెట్టుబడులు రప్పించడం అనేది మాత్రమే మాకు తెలుసు అని అన్నారు. విశాఖ అభివృద్ధి అనే మాట వైసీపీ నేతల నోటి నుంచి వస్తుంటే ప్రజలు నవ్వుతున్నారు. కోడిగుడ్డు మంత్రి అమర్నాథ్ ను, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మలేదు ఇటు పెట్టుబడిదారులు కూడా నమ్మలేదని విమర్శించారు. విశాఖ లో జరిగిన సదస్సులో 613 ఒప్పందాలతో రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయని తెలిపారు.

# పాడేరులో భగవాన్ శ్రీ బిర్సా ముండా విగ్రహం ఆవిష్కరణ





**- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గాజువాక బిజేపి నేతలు కేఎన్ఆర్ తదితరులు**

పాడేరు, చైతన్యవారధి: పాడేరు గవర్నమెంట్ మెడికల్ కళాశాల కూడలిలో గిరిజనుల ఆరాధ్య దైవం భగవాన్ శ్రీ బిర్సా ముండా విగ్రహం ఆవిష్కరణ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరన్ మార్ఝి , గౌరవ అతిథులుగా రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పాల్గొని వారి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు . పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అధ్యక్షతన బారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భగవాన్ శ్రీ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘణంగా జరుపుకుంటున్నామని అన్నారు. బ్రిటీష్ వారిని ఎదిరించి, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప స్వతంత్ర సమరయోధుడు అని అన్నారు. గిరిజనుల పాలిట ప్రత్యక్ష దైవం భగవాన్ బిర్సా ముండా అని అన్నారు. పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ ఒక గిరిజన మహిళను భారత రాష్ట్రపతిగా నియమించిన ఘనత బిజేపికే దక్కుతుందని అన్నారు. మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆవిష్కరించారని గుర్తు చేసారు. గిరిజనుల సంక్షేమానికి కేంద్రం లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దింశా నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ,మట్టా ప్రసాద్, అరకు ఇంచార్జ్ పంగి రాజారావు,సురేంద్ర మోహన్, గాజువాక ఇంచార్జ్ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, మండల అధ్యక్షులు రంగనాయకులు, నాగేశ్వరరావు, అశోక్, మనోహర్, కృష్ణారెడ్డి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మాటలను వక్రీకరించడం తగదు

**– టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



గాజువాక, చైతన్యవారధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించేటట్లుగా ప్రతిపక్షాలు మాట్లాడటం తగదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ధ్వజబెట్టారు. స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉన్నదాన్ని కేంద్రం నుండి రాష్ట్రం సుమారు రూ. 14 వేల కోట్లు తీసుకొచ్చింది. వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకుందని తెలిపారు. బాధ్యతగా తీసుకొచ్చిన డబ్బులను సద్వినియోగం చేసుకోవాలన్న విషయాన్ని పక్కన పెట్టి కార్మికులు ప్లాంట్ ను ఏదో అన్నారని మాట్లాడడం సరికాదని, కష్టపడి కేంద్రాన్ని ఒప్పించి రూ.14 వేల కోట్లల్లో రూ.11 వేల కోట్లు తీసుకురావడం జరిగింది. రాష్ట్రం నుంచి కూడా సుమారు రూ.2,600 కోట్లు ఆర్థిక సాయం అందించడం జరిగింది. 30 శాతం పనులు జరుగుతున్న ప్లాంట్ ని 80 శాతం పనులు జరిగేలా చేశాం. పబ్లిక్ సెక్టార్ లో ఉన్న ఏ ప్లాంట్ అయినా లాభాల్లో నడవాలంటే మేనేజ్ మెంట్, కార్మికులు బాధ్యతగా వ్యవహరించాలి. వైసీపీ నాయకులతో కలిసి కొందరు వ్యాఖ్యల్ని వక్రీకరించి మాట్లాడారు. లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు కృషితోనే ఈ ప్లాంట్ లాభాలబాటలో నడుస్తోంది. కార్మికులు, ప్రజానీకం, స్టీల్ ప్లాంట్ లోని వారందరు ఈ విషయాలు గ్రహించాలని అయన కోరారు.

# ఐఐఎంవీలో ముగిసిన పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్



విశాఖపట్నం: ఆనందపురం మండలం గంభీరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో 11 నెలల పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్ విత్ డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐఐఎం–వీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ సూత్రాలను ఆధునిక విశ్లేషణ, డేటా ఆధారిత నిర్ణయాల సామర్థ్యాలతో కలిపి ఈ ప్రత్యేక కోర్సును రూపొందించినట్లు తెలిపారు. ఈ బ్యాచ్‌లో ఆపరేషన్స్, ఫైనాన్స్, హెచ్ఆర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఐటీ, అనలిటిక్స్ వంటి విభిన్న రంగాలకు చెందిన 31 మంది నిపుణులు ఉన్నారన్నారు. ఈ నిపుణులు డేటా సైన్స్‌ను వాస్తవ మేనేజీరియల్ సమస్యలకు ఎలా ఉపయోగించవచ్చో విజయవంతంగా నిరూపించారని కొనియాడారు. జీవితంలో మూడు రకాల మనుషులు ఉంటారని, మార్పు తీసుకువచ్చే నాయకులే సమాజంపై ప్రభావం చూపుతారన్నారు. జనరల్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజిక్ లీడర్‌షిప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా ఫ్రేమ్‌వర్క్, ప్రెడిక్టివ్, ప్రిస్క్రిప్టివ్ అనలిటిక్స్ వంటి అంశాలను ఈ కోర్సులో భాగం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొగ్రామ్ డైరెక్టర్లు డా.శివశంకర్ సింగ్ పటేల్, ప్రొఫెసర్ అనుపమ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పాత బ్యాంక్ ఖాతాలోని నగదు మర్చిపోయారా!

**- రిజర్వ్ బ్యాంక్ ఏం చెప్తున్నది**




ఏండ్ల తరబడి ఎలాంటి లావాదేవీలు లేకుండా నిష్క్రియంగా ఉన్న మీ బ్యాంక్ ఖాతాల్లోని నగదును తిరిగి ఇప్పటికీ పొందవచ్చు. అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఖాతాదారులకు సహాయం చేస్తున్నది. ఖాతాలోని నగదు పదేండ్లకుపైగా అలాగే ఉంటుంటే ఆ సొమ్ము.. ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌లో ఉండవచ్చు. దీన్ని క్లెయిం చేసుకోవడానికి ఇలా ప్రయత్నించండి. ముందుగా మీ బ్యాంక్ శాఖను గానీ, ఆ బ్యాంక్‌కు చెందిన ఏదైనా శాఖనుగానీ సంప్రదించవచ్చు. ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కేవైసీ పత్రాలతో ఫారంను సమర్పించాలి. సదరు సొమ్ము మీదే అని తేలితే వడ్డీతో సహా బ్యాంక్ చెల్లించే వీలున్నది.

చివరగా.. పిల్లల భవిష్యత్తు కోసం పెద్దవాళ్లు (తల్లిదండ్రులు) బ్యాంక్ ఖాతాల్లో తమ కష్టార్జితాన్ని దాచడం, డిపాజిట్లు చేయడం సహజమే. అయితే దురదృష్టవశాత్తు డిపాజిట్‌దారులు చనిపోతే ఆ సొమ్ము గురించి వారసులకు తెలియని పరిస్థితి. ఇలాంటప్పుడు బ్యాంక్ ఖాతాలు, డిపాజిట్లకు సంబంధించిన ఏ సమాచారమున్నా ఆయా బ్యాంక్ వెబ్‌సైట్లలో వెతకవచ్చు. ఆర్బీఐ ఉద్గమ్ పోర్టల్ https://udgam.rbi. org.in లో నూ చూసుకోవచ్చు. ఈ డిసెంబర్‌దాకా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఆర్బీఐ ప్రత్యేక శిబిరాలనూ నిర్వహిస్తున్నది. వీటి ద్వారా కూడా మన సొమ్మును మనం తిరిగి పొందే అవకాశాలున్నాయి.

# 2025లో పెద్ద 'ఐపీఓ'లదే హవా




ఈ ఏడాది భారీ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల హవా నడుస్తోంది. సాధారణంగా పెద్ద పబ్లిక్ ఇష్యూలు, మదుపర్ల సహనాన్ని పరీక్షిస్తాయని పేరుంది. కానీ ఈ ఏడాది మాత్రం ప్రాథమిక మార్కెట్‌లో పెద్ద కంపెనీలు కాసుల పంట కురిపించాయి. ఈ ఏడాది వచ్చిన పెద్ద ఐపీఓలకు మదుపర్ల నుంచి మంచి స్పందన లభించింది. సంస్థాగతంగా నగదు లభ్యత కూడా ఇందుకు దోహదపడింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.5,000 కోట్లు దాటిన ఐపీఓలకు సగటున 17.7 రెట్ల స్పందన లభించింది. 2021 తర్వాత ఇదే అత్యధికం. సాధారణంగా పెద్ద ఐపీఓలకు 8-10 రెట్ల స్పందన లభిస్తుంది. 2025లో వచ్చిన 6 పెద్ద ఐపీఓల్లో నాలుగింటికి మదుపర్ల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా (38.17 రెట్లు), లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ (28.35 రెట్లు), గ్రో (17.6 రెట్లు చొప్పున)లకు స్పందన దక్కింది. హెక్సావేర్ టెక్నాలజీస్ (2.27 రెట్లు), టాటా క్యాపిటల్ (1.96 రెట్లు) స్పందన సంపాదించాయి. పెద్ద ఐపీఓలకు వచ్చిన స్పందనలో దాదాపు 75-80 శాతం సంస్థాగత మదుపర్ల నుంచే వచ్చిందని కేజ్రీవాల్ రీసెర్చ్ విశ్లేషకులు అరుణ్ కేజ్రీవాల్ తెలిపారు. కార్పొరేట్ ట్రెజరీలు, బ్యాంక్ ట్రెజరీలు కూడా క్రియాశీలంగా ఉన్నాయన్నారు. 2025లో ఇప్పటివరకు 84 ఐపీఓలు రూ.1.29 లక్షల కోట్లు సమీకరించాయి. ఇందులో 6 పెద్ద ఐపీఓలు రూ.62,000 కోట్లు దక్కించుకున్నాయి. ఇంతకు ముందు 2021లో నైకాకు 81 రెట్ల స్పందన లభించింది. పేటీఎం, సోనా బీఎల్‌డబ్ల్యూ మాత్రం 2 రెట్ల మార్కును అందుకోవడానికి ఇబ్బందులు పడ్డాయి. 2022లో ఎల్‌ఐసీ కూడా 2.65 రెట్లు, డెలివరీ 1.33 రెట్ల స్పందన మాత్రమే దక్కించుకున్నాయి. 2023లో మెగా ఇష్యూలు రాలేదు. 2024లో మాత్రం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (49.97 రెట్లు), విశాల్ మెగామార్ట్ (20.47 రెట్లు) దుమ్మురేపాయి.

# ఆసియా పసిఫిక్ ప్రాంతానికి మరో 19,560 విమానాలు అవసరం

**- రాబోయే 20 ఏళ్లపై ఎయిర్‌బస్**




బ్యాంకాక్: రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,520 కొత్త విమానాలు అవసరం పడుతుండగా.. వీటిల్లో 19,560 వరకు ఆసియా పసిఫిక్ ప్రాంతానికే కావాల్సి ఉంటుందని ఎయిర్‌బస్ అంచనా వేసింది. అంటే కొత్త విమానాల కోసం ఈ ప్రాంతం నుంచే 46 శాతం వరకు గిరాకీ ఉందన్నమాట. ముఖ్యంగా ఈ అధిక గిరాకీలో చైనా, భారత్‌దే కీలక పాత్ర అని ఎయిర్‌బస్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లే తెలిపారు. విమాన ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో.. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వార్షికంగా ప్రయాణికుల సంఖ్యలో 4.4 శాతం పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా సగటు పెరుగుదల అయిన 3.6 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువ. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన విపణుల్లో భారత్ కూడా ఒకటి. ప్రయాణికుల రద్దీ పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే భారత్‌కు చెందిన విమానయాన సంస్థలు భారీ సంఖ్యలో కొత్త విమానాలకు ఆర్డరు ఇచ్చిన సంగతి తెలిసిందే. రాబోయే 20 ఏళ్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి సుమారు 3,500 వరకు పెద్ద విమానాలు (వైడ్ బాడీ), 16,100 వరకు చిన్న విమానాలు (న్యారో బాడీ) అవసరం అవుతాయని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో విమాన ప్రయాణికుల రద్దీ పెరగడంలో భారత్, చైనా కీలక పాత్ర పోషిస్తున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ (ఏఏపీఏ) తెలిపింది. వచ్చే ఏడాది కూడా విమాన ప్రయాణికుల రద్దీలో వృద్ధి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు పుంజుకుంటుండటం, ప్రయాణికులు-సరకు రవాణాపరంగా గిరాకీ పెరుగుతుండటం ఇందుకు కారణమని ఏఏపీఏ డైరెక్టర్ జనరల్ సుభాష్ మేనన్ తెలిపారు. ఎయిరిండియా సహా 18 విమానయాన సంస్థలకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తోంది.

# ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీపీసీ అణువిద్యుత్ ప్రాజెక్ట్

**- అవకాశాలు పరిశీలిస్తున్నామన్న సంస్థ ఉన్నతాధికారి**



దిల్లీ: ప్రభుత్వరంగంలోని అగ్రగామి విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ దేశంలోని పలు ప్రాంతాల్లో 700 మెగావాట్లు, 1000 మె.వా., 1,600 మె.వా. సామర్థ్యంతో అణువిద్యుత్ ప్రాజెక్టులు స్థాపించడానికి సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఇందుకు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లు సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) గుర్తించి, అనుమతి ఇచ్చిన ప్రాంతాల్లో బోర్డు సూచనలకు అనుగుణంగా ప్లాంట్లను స్థాపించనున్నట్లు వివరించారు. 2047 కల్లా 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సాధించాలన్న ప్రభుత్వ ప్రణాళికలో, 30% వాటా (30 గిగావాట్ల ఉత్పత్తి) సాధించాలనేది సంస్థ లక్ష్యం. 1 గిగావాట్ అణువిద్యుత్ ప్లాంటు కోసం రూ.15,000-20,000 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుంది. నిర్మాణ ప్రణాళిక నుంచి, ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభించడానికి కనీసం మూడేళ్లు పడుతుందని సంస్థ అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ల కోసం ముడిపదార్థాల సమీకరణపై ఎన్‌టీపీసీ దృష్టి సారించింది. అణువిద్యుత్తు ప్లాంట్లకు కీలకమైన యురేనియం ఆస్తుల సమీకరణకు విదేశాల్లోనూ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో వాణిజ్య-సాంకేతిక ఒప్పందం చేసుకుంది.

ప్రస్తుతం దేశీయంగా మొత్తం 84,848 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ఎన్‌టీపీసీ కలిగి ఉంది. ఇందులో బొగ్గు/గ్యాస్/హైడ్రో/సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లున్నాయి. ప్రస్తుతం రాజస్థాన్‌లో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌తో కలిసి రూ.42,000 కోట్లతో అణు విద్యుత్తు ప్లాంటును నిర్మిస్తోంది.

# మెరుపు వెనక ఉరుము!



సోషల్ మీడియా.. ఎవరో ఒకరిని ఒక్కసారిగా ఆకాశానికి ఎత్తేస్తుంది. ఫొటోనో-వీడియోనో.. డ్యాన్సో-డైలాగో.. ఏదో ఒకదాన్ని తెగ వైరల్ చేసేస్తుంది. అందులో కనిపించిన వారిని ఓవర్‌నైట్ స్టార్‌గా మార్చేస్తుంది. ప్రస్తుతం మరాఠీ నటి గిరిజ ఓక్ కూడా.. అలాంటి వైరల్ ఫేమ్‌నే అందుకున్నది. తాజాగా, ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నది గిరిజ. నీలిరంగు చీరలో సింపుల్‌గానే ముస్తాబైనా.. తన అందంతో అందరినీ కట్టిపడేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నాయి. దాంతో, నిన్నమొన్నటి దాకా ఎవరికీ పెద్దగా తెలియని గిరిజ.. ఇప్పుడు జాతీయ స్థాయిలో తెగ ట్రెండ్ అవుతున్నది. దాంతో, 'ఎవరీ గిరిజ?' అంటూ నెట్టింట సెర్చ్ మొదలైంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్.. గిరిజ ఓక్ స్వస్థలం. డిగ్రీ తర్వాత నాటకరంగంలోకి ప్రవేశించింది. థియేటర్ ఆర్ట్స్ ప్రావీణ్యం సంపాదించి, మొదట్లో కొన్ని యాడ్ ఫిల్మ్స్ చేసింది. ఆ తర్వాత సినిమాలు, సీరియల్స్‌లోకి ఎంటరైంది. మరాఠీతోపాటు హిందీలోనూ అవకాశాలు దక్కించుకుంది. తారే జమీన్ పర్, షోర్ ఇన్ ది సిటీ, జవాన్ లాంటి సినిమాల్లో నటించింది. కార్టెల్, మోడ్రన్ లవ్ ముంబై వెబ్‌సిరీస్‌లతోనూ మంచిపేరు తెచ్చుకుంది. అయితే, దాదాపు 20 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటూ, 30 వరకూ ప్రాజెక్టులలో పనిచేసినా ఈ నటికి పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ, ఒకేఒక్క యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ.. గిరిజ ఓక్‌ను జాతీయస్థాయి సెలెబ్రిటీగా మార్చేసింది. ఉరుము... ఓవైపు గిరిజ ఓక్‌ను దేశవ్యాప్తంగా తెగ వైరల్ చేసిన సోషల్ మీడియా.. మరోవైపు ఆమెకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతున్నది. కొందరు గిరిజ ఫొటోలు, వీడియోలను ఏఐ టెక్నాలతో అశ్లీలంగా మార్ఫింగ్ చేస్తున్నారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. ఈ మార్ఫింగ్ ఫొటోలపై గిరిజ ఓక్ తాజాగా స్పందించింది. ఏఐతో సృష్టించిన మార్ఫింగ్ ఫొటోల వల్ల తాను ఇబ్బంది పడుతున్నట్లు చెప్పుకొచ్చింది. ముఖ్యంగా, తన 12 ఏళ్ల కొడుకు భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేసింది. "ఇప్పుడు వైరల్ అవుతున్న మార్ఫింగ్ ఫొటోలను చాలామంది చూసి వదిలేస్తారు. కానీ, అవి ఇంటర్నెట్లో శాశ్వతంగా ఉండిపోతాయి. నా 12 ఏళ్ల కొడుకు ఇప్పుడు సోషల్ మీడియా వాడటం లేదు. కానీ, భవిష్యత్తులో వాడవచ్చు. అప్పుడు ఈ మార్ఫింగ్ ఫొటోలను చూస్తే? ఆ ఆలోచనే నాకు భయాన్ని కలిగిస్తున్నది" అంటూ భావోద్వేగానికి గురైంది.ఆ ఫొటోలను వెంటనే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని విజ్ఞప్తి చేసింది.

# ప్రేమకు అర్థమే మారిపోయింది



ప్రస్తుతం 'ప్రేమ' అనే మాటకు అర్థమే మారిపోయిందని అంటున్నాడు బాలీవుడ్ సీనియర్ హీరో అజయ్ దేవ్‌గన్. తమకాలంలో 'ప్రేమ'కు ఎంతో విలువ, ప్రాధాన్యత ఉండేదనీ.. కాలక్రమంలో దాని విలువ తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. తన తాజా సినిమా 'దే దే ప్యార్ దే 2' ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా.. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చాడు అజయ్ దేవ్‌గన్. ఈ సందర్భంగా.. ప్రేమ, పెళ్లి విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "మన తరంలో.. 'ఐ లవ్‌యూ' అని చెప్పడం చాలా పెద్ద విషయం. ఎదుటివారిపై ఎంతో ప్రేమ, నమ్మకం ఉంటేనేగానీ చెప్పేవాళ్లం కాదు. కానీ, ఇప్పుడు ఆ మాటలకు అర్థం, విలువ లేకుండా పోయింది. 'ప్రేమ' లోతు ఇప్పటివారికి అర్థం కావడంలేదు" అంటూ చెప్పుకొచ్చాడు. అయితే, అంతకుముందు అజయ్ దేవ్‌గన్ భార్య, బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ కూడా ప్రేమ-పెళ్లి విషయంపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. పెళ్లికీ ఒక ఎక్స్‌పైరీ డేట్ ఉండాలని, రెన్యువల్ ఆప్షన్ కూడా ఉండాలని కాజోల్ చెప్పడం.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అజయ్ దేవ్‌గన్-కాజోల్‌ది బాలీవుడ్‌లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రేమకథలలో ఒకటి. 1995లో వచ్చిన 'హల్చల్' సినిమా సెట్స్‌లో.. వీరిద్దరూ మొదటిసారి కలుసుకున్నారు. స్నేహంతో మొదలు పెట్టి.. ప్రేమికులుగా మారారు. దాదాపు నాలుగేళ్ల డేటింగ్ తర్వాత.. 1999లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత కూడా పలు విజయవంతమైన చిత్రాలలో కలిసి నటించారు. అయితే, ప్రేమ-పెళ్లి వ్యవహారంపై ఈ బాలీవుడ్ కపుల్ చేసిన వ్యాఖ్యలు.. ప్రస్తుతం నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. 26 ఏళ్ల వైవాహిత జీవితం నేపథ్యంలో.. కాజోల్-అజయ్ దేవగన్ నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం ఏమిటా? అని నెటిజనం ఆశ్చర్యపోతున్నది. 'ఆ వ్యాఖ్యల వెనక మర్మం ఏమిటా?' అని బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నది. ఇక సినిమాల విషయానికి వస్తే.. కాజోల్ ఇటీవలే మా, సర్జమీన్ చిత్రాలతో ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం 'మహారాజ్ఞి' సినిమా చిత్రీకరణ దశలో ఉన్నది. అజయ్ దేవ్‌గన్ కూడా మంచి జోష్‌మీద సినిమాలు చేస్తున్నాడు. తాజాగా, 'దే దే ప్యార్ దే2'తో మరో హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

# ఆనందకరమైన నగరంగా నిలవడం గొప్ప విషయం



ఆర్థిక రాజధాని ముంబై.. ఆనందకరమైన నగరంగా నిలవడం గొప్ప విషయమని అంటున్నదని బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్. తాజాగా, టైమ్ అవుట్ మ్యాగజైన్ విడుదల చేసిన 'సిటీ లైఫ్ ఇండెక్స్-2025'లో ఆసియాలోనే అత్యంత సంతోషకరమైన నగరంగా ముంబై ఎంపికైంది. ఇదే నగరంలో పుట్టి పెరిగిన 53 ఏళ్ల రవీనా.. ముంబైతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా పంచుకున్నది. "ఇక్కడి ప్రజలే.. ఈ మహానగరపు ఆత్మ. వారి కలలను నెరవేర్చడంలో ముంబై ఎప్పుడూ ముందే ఉంటుంది" అంటూ ముంబైని ఆకాశానికి ఎత్తేసింది. ఇంకా మాట్లాడుతూ.. "ఇక్కడి ప్రజల్లోనే ఈ నగర బలం మొత్తం దాగిఉంది. ఏదైనా సరే ముందుకు సాగడానికి, ఆశాజనకంగా ఉండటానికి ఇక్కడి ప్రజల్లో చెప్పలేని అవగాహన ఉంది. ఇక్కడ అన్నివర్గాల వారూ నివసిస్తారు. కూలీలు మొదలుకొని కోట్లకు పడగలెత్తినవారు కనిపిస్తారు. ఈ నగరం అందరినీ సమాన దృష్టితోనే చూస్తుంది. ఎందుకంటే.. వారంతా ముంబై అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించేవారే కదా!" అంటూ చెప్పుకొచ్చింది. నగరంలో తనకు ఆనందాన్ని కలిగించే ప్రదేశాలెన్నో ఉన్నాయనీ, ప్రశాంతమైన వాతావరణంలో, జీవితాన్ని రీఛార్జ్ చేసుకుంటూ సమయాన్ని గడిపాననీ వెల్లడించింది. ఇక సినీ పరిశ్రమ కేంద్రంగా పెరిగిన రవీనా.. నగరంలోని చిరస్మరణీయ సినిమా షూటింగ్‌ల గురించీ పంచుకున్నది. "సినిమా కోసం నా తండ్రి పడే కష్టాన్ని చూస్తూ పెరిగాను. స్కూల్‌లో కన్నా.. సినిమా సెట్స్‌లోనే ఎక్కువగా గడిపాను. అందుకే.. ఈ సినిమా ప్రపంచం నన్ను అమితంగా ఆకర్షించింది. గోరేగావ్ ఫిల్మ్ సిటీ, దక్షిణ ముంబై లాంటి ప్రదేశాలలో జరిగే షూటింగ్స్.. నా జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి" అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నది. కొన్నేళ్లుగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ.. ముంబై నగర ఆత్మ, స్ఫూర్తి ఏమాత్రం మారలేదని చెబుతున్నది. దివంగత బాలీవుడ్ దర్శకుడు రవి టాండన్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది రవీనా టాండన్. 'పథర్ కే ఫూల్'లాంటి సూపర్ హిట్ చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టి.. 'గోల్డెన్ లెగ్' ట్యాగ్ అందుకున్నది. ఆ తర్వాత హిట్టుమీద హిట్టు కొడుతూ.. బాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నది. ఒక్క ఏడాదిలోనే ఎనిమిది బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకున్నది. అడపాదడపా సినిమాలు చేస్తున్నా.. లైమ్‌లైట్‌కు మాత్రం దూరంకాలేదు. ప్రస్తుతం రవీనా నట వారసురాలిగా ఆమె ముద్దుల తనయ రషా తడానీ కొనసాగుతున్నది.



# వారికి మద్దతుగా నిలవాలి

'నేను నటిని మాత్రమే కాదు. ప్రస్తుతం తల్లిని కూడా. ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే ఈ రెండు బాధ్యతల్నీ విజయవంతంగా నిర్వర్తించొచ్చని కొందరు అంటున్నారు. కానీ వాస్తవానికి అది చాలా కష్టం. కొత్తగా తల్లి అయిన స్త్రీలను పని ఒత్తిడికి లోను చేయడం సమంజసం కాదు. ఈ విషయంలో అంతా సదరు స్త్రీలకు మద్దతుగా నిలవాలి.' అని నటి దీపిక పదుకోణ్ అన్నారు. '8గంటల వర్కింగ్ అవర్స్' డిమాండ్‌తో కొన్ని నెలలుగా చర్చనీయాంశమయ్యారామె. ఈ కారణంగా కొన్ని సినిమాలను కూడా ఆమె వదులుకున్నారు. రీసెంట్‌గా తన అభిప్రాయాన్ని సమర్థించుకుంటూ మళ్లీ మాట్లాడారు దీపిక. 'ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే అత్యుత్తమంగా పనిచేయగలం. ఒత్తిడికి లోనైతే అవుట్‌పుట్ కూడా సరిగ్గా రాదు. అందుకే.. నా సొంత ఆఫీస్‌లో కూడా నా ఉద్యోగులందరికీ సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పనిచేయిస్తాను. ఎవరికైనా సరే ఆరోగ్యమే ప్రధానం. దాన్ని కాపాడుకోవడమే అన్నింటికన్నా ముఖ్యం.' అని చెప్పుకొచ్చారు దీపిక పదుకోణ్.

CHAITANYA VAARADHI" Telugu Daily Printed, Published and owned by Bonda Gopinadha Rao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Published at D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021.and Printed at Chaitanya Vaaradhi Printers, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Editor : Bonda Gopinadharao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Cell : 9848682422, RNI.NO.APTEL\2006\18521, Postal Regd.No. ANK/0017/2015/2017 E-mail: chaitanyavaradhi@gmail.com